ప్రజాశక్తి
మంగళవారం 23 డిసెంబర్ 2025 5 కర్నూలు

బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిరి

మారని టిడ్కో

- మౌలిక వసతులు కరువు
- నివాసానికి అననుకూల వాతావరణం
- ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై ఒత్తిడి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇళ్లలో చేరాలని లబ్ధిదారులపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు...

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి గతంలో అప్పటి మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళ్ల పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి.

నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే లబ్ధిదారులు ఇళ్లలో చేరాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. మౌలిక వసతులు లేని ప్రాంతాల్లో ఎలా నివాసం ఉండగలమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని మార్చి లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

ఈ-ఆఫీస్ ద్వారానే ఫైళ్ల నిర్వహణ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ఈ ఆఫీస్ ద్వారానే ఫైల నిర్వహణ జరగాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ - పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని, ఎండార్స్‌మెంట్ స్పష్టంగా ఇవ్వాలని ఆదేశించారు. పరిష్కారాలపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శాఖకు సంబంధించిన ఫైళ్ల నిర్వహణ పూర్తిగా ఈ-ఆఫీస్ విధానంలోనే జరగాలని, ఫిజికల్ ఫైళ్లు అనుమతించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా శాఖల కింది స్థాయి అధికారుల వరకు ఈ-ఆఫీస్‌లోనే ఫైళ్లు నిర్వహించాలని ఆదేశించారు. ఈ అంశంపై ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ కోసం ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల నుండి సానుకూల స్పందన రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పెన్షన్లు, దీపం, పారిశుధ్యం, అన్న క్యాంటీన్లు, వైద్య ఆరోగ్యం వంటి శాఖల్లో నెగెటివ్ ఫీడ్‌బ్యాక్ రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారెస్ట్, ఇరిగేషన్, మధ్యాహ్న భోజనం, సంక్షేమ శాఖలు, క్రీడలు వంటి శాఖలు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో అర్జీ రిజిస్టర్ చేయాలి

మండల స్థాయిలో పిజిఆర్ అర్జీ రిజిస్టర్ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులకు ఆదేశాలు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌కు వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.మండలాల్లో అర్జీల రిజిస్ట్రేషన్ తక్కువగా ఉండటంపై తహసీల్దార్లను ప్రశ్నించారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకపోవటంపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

మిషన్ వాత్సల్య కింద ఉద్యోగ నియమకాలు

మిషన్ వాత్సల్య పథకం కింద ఎంపికైన ఉద్యోగులకు నియామక పత్రాలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.విజయ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద పాల్గొన్నారు.

యుపిహెచ్‌సిని రాష్ట్ర అదనపు సంచాలకుల తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలో శ్రీరామ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్ కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, వాక్సిన్, ల్యాబ్ రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యులను, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఇంటింట వైద్య సిబ్బందితో కలిసి పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకున్న గుర్తులను పరీక్షించారు. పిల్లలు అంగవైకల్యం లేకుండా ఉండడానికి తల్లితండ్రులు ఎంతో భాద్యతగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలనుంచి ఐదేళ్లలోపు పిల్లలకు వచ్చే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి పోలియో, పోలియో అనేది వైరస్ వలన సంక్రమిస్తుందన్నారు. ఈ వైరస్ చిన్నారుల నాడీ వ్యవస్థ దెబ్బతీసి కండరాలు బలం కోల్పోయే స్థితికి తీసుకొనివస్తుందని వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులకు ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమించడమే కాకుండా తీవ్రమైన దుష్ఫలితాలను చూపిస్తాయన్నారు. అందుకే పుట్టిన శిశువు మొదలుకొని 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వెయిస్తే అంగవైకల్యం నుంచి వారిని రక్షించడంతో పాటు పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దామని తెలిపారు. చిన్నారికి సిబ్బందితో కలిసి పోలియో చుక్కలు వేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, అందరు సమిష్టిగా సమన్వయంగా ముందుకు సాగి పల్స్ పోలియోను 100వాతం విజయవంతం చేయాలని కోరారు. డిపిఎంయు డాక్టర్ శైలేష్ కుమార్, వైద్యులు నందిని, డిపిఒ విజయరాజ్, ఎపిడమాలజిస్ట్ వేణుగోపాల్ యాదవ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు , ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న అనిల్ కుమార్

ఉపాధి చట్టాన్ని కొనసాగించాలి

- పేదలకు ఉపాధిని దూరం చేస్తే సహించం
- కలెక్టరేట్ ఎదుట వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పేదలకు అన్నం పెట్టే మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధి చట్టాన్ని మార్చడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు రాజశేఖర్, రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఆందోళనలో ప్రభాకర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేటర్ సంస్థలకు రుణాలను 11 సంవత్సరాల కాలంలో 17 లక్షల కోట్లకు పైగా చేయించిందని కానీ దేశం అభివృద్ధి చెందాలంటే పల్లె ప్రాంతాలు అభివృద్ధి చెందాలని, గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఏకైక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం కోసం గత 11 సంవత్సరాల కాలంలో అరకొర నిధులు కేటాయించి పూర్తిగా ఎత్తివేయాలని దురుద్దేశంతో విబి- జిరామ్- జి అనే పేరు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వెంటనే విబి-జి రామ్ -జీ పేరును రద్దు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 60 శాతం మాత్రమే ఇస్తామని, మిగిలిన 40 శాతం రాష్ట్రాలే భరించాలని తెలిపారన్నారు. కేంద్రం ఎప్పుడు పని మొదలు పెడుతుందో కేంద్రమే తెలియజేస్తుందని రాష్ట్రాలకు ఎలాంటి హక్కు లేదని చెప్పడం చాలా దుర్మార్గమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ పథకం అందకుండా నిర్వీర్యం చేసి పూర్తిగా ఎత్తివేయాలని దురుద్దేశంతో దుర్మార్గమైన విధానాన్ని అనుసరిస్తుందన్నారు. గాంధీని దేశమంతా జాతిపితగా గౌరవిస్తుంటే, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పాలన సాగిస్తున్న బిజెపి మహాత్మా గాంధీ పైన ఉన్న అక్కసును వెళ్లగక్కేందుకు గాడ్సే వారసులమంటూ నిరూపించుకునేందుకు పేరు మార్చుతూ లోక్‌సభలో ప్రవేశపెట్టడం లౌకిక పార్టీలన్నీ వ్యతిరేకించినా బలం ఉందని ఆమోదించుకోవడం దుర్మార్గమని అన్నారు. వెంటనే రాష్ట్రపతి ఆమోదం తెలిపి చట్టాన్ని తీసుకురావడం జాతిపిత మహాత్మ గాంధీని మరోసారి హత్య చేయడమేనన్నారు. గాంధీజీ పేరును పలుకబోము అలా పిలిచే ఏ పథకమైనా రద్దు చేస్తామని ప్రజలకు సంకేతాన్ని ఇచ్చిందని అన్నారు. రాబోయే కాలంలో కార్మికులు వ్యవసాయ కార్మికులు కలిసి ఉద్యమాలు ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వానికి చరమగీతం పాడేలా పోరాటాలు చేయాలని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంను యధావిధిగా కొనసాగించి 200 రోజులు పని దినాలు కల్పించి, రూ.600 రోజువారి కూలీ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రూ.రెండు లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలని లేకుంటే బిజెపి ప్రభుత్వం పతనం కాక తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు ఎండి అంజిబాబు, ఎండి ఆనంద్‌బాబు, టి.రాముడు, సాయిబాబా, విజయ్, రామకృష్ణ, షరీఫ్, సిసిఐఎంఎల్ నాయకుడు వెంకట స్వామి, రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు సుంకన్న, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, హరీష్ కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

విద్యార్థులను, ప్రొఫెసర్లను, పిడిని , విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

రాష్ట్ర అంతర్ కళాశాల పోటీల్లో కెఎంసి విద్యార్థుల హవా

విన్నర్స్‌గా బాల్ బ్యాడ్మింటన్ టీమ్-రన్నర్స్‌గా ఫుట్ బాల్ టీమ్
-కబడ్డీలో మూడో స్థానం

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ వారు నిర్వహించిన 27వ మెడికల్ , డెంటల్ అంతర్ కళాశాల ఆటల పోటీల్లో కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన వైద్య విద్యార్థుల బాల్ బ్యాడ్మింటన్ టీం ఫైనల్ కి చేరుకొని విన్నెర్స్‌గా నిలిచి మొదటి స్థానం సాధించడం, కబడ్డీ టీం మూడో స్థానం , ఫుట్ బాల్ టీం రెండో స్థానం సాధించడం పట్ల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అభినందించారు. కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు వైద్య విద్యలోనే కాక ఆటల పోటీలలో కూడా విజయాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆటల పోటీలో బాల్ బ్యాడ్మింటన్ 17 జట్లు పాల్గొనగా కర్నూలు వైద్యాకళాశాల జట్టు విన్నెర్స్ గా 1 వ స్థానం లో నిలిచింది. 2వ స్థానంలో సిద్దార్థ మెడికల్ కాలేజీ విజయవాడ రన్నర్స్‌గా నిలిచింది. ఆ తర్వాత జరిగిన కబడ్డీ పోటీలో 23 జట్లు పాల్గొనగా కెఎంసి జట్టు సెమీ ఫైనల్ చేరుకొని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ శ్రీకాకుళం జట్టు పై 3వ స్థానంలో నిలిచింది. ఈ పోటీలు ఈ నెల 9 నుండి 12 వరకు జిఎస్ఎల్ రాజమండ్రి మెడికల్ కాలేజీలో నిర్వహించారు. బాల్ బ్యాడ్మింటన్ కెప్టెన్ గా బి మహీధర్ రెడ్డి, కబడ్డీ టీం కెప్టెన్ సి.హెచ్ దినేష్ వ్యవహరించారు. మెడికల్ కాలేజీ స్పోర్ట్స్ పోర్టు కమిటీ చైర్మెన్ విద్యాసాగర్, డాక్టర్ విజయబాబు, డాక్టర్ విజయశంకర్, డాక్టర్ ప్రవీణ, ఫిజికల్ డైరెక్టర్ రామకృలను ప్రిన్సిపల్ అభినందించారు.

అల్పాహారం, స్నాక్స్‌లు అందించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

10వ తరగతి ఉత్తమ ఫలితాల పేరుతో 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలో ఉదయం-సాయంత్రం అదనపు తరగతుల వల్ల విద్యార్థులు మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్ప పేర్కొన్నారు. అందుకే విద్యార్థులకు అల్పాహారం స్నాక్స్ అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రంగప్ప మాట్లాడుతూ, డిసెంబర్ 6 నుంచి మార్చి 15 వరకు నిరంతర తరగతుల వల్ల పోషకాహారం లేకుండా ఏకాగ్రత తగ్గుతోందన్నారు. పేద కుటుంబాల విద్యార్థులు ఆకలి-అలసటతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారని చెప్పారు. పరీక్షల ఒత్తిడితో పాటు ఆహార లోపం మానసిక ఆరోగ్యానికి హాని చేస్తోందని హెచ్చరించారు. ఉదయం అదనపు తరగతులకు పోషకాహారంతో అల్పాహారం, సాయంత్రం స్నాక్స్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు వంశీ పాల్గొన్నారు.

హలో కార్మిక చలో విశాఖ

-4న బహిరంగ సభను జయప్రదం చేయండి
-ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జండావిష్కరణలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని నాలుగున జరిగే భారీ బహిరంగ సభకు ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆటో యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, న్యూ సిటీ కార్యదర్శి బి. రాధాకృష్ణ కోరారు. విశాఖపట్నంలో సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను పురస్కరించుకొని కర్నూలు రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్లలో సిఐటియు జెండాను సిఐటియు ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ ఎగురవేశారు. న్యూ సిటీ ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు మల్లీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కె.ప్రభాకర్, న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి. రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల జీవోల పేరుతో అధిక ఛలానాలు విధిస్తూ కార్మికులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. వారన్నారు. ముఖ్యంగా రవాణా రంగ కార్మికులైన ఆటో కార్మికులకు ఎలాంటి ప్రయోజనకర కార్యక్రమాలు చేయడం లేదని, 15 సంవత్సరాలు దాటిన వాహనాల టాక్స్ అపరాధ రుసుం పేరుతో భారీ మొత్తంలో ఛలానా ఫీజులు పెంచారని, వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 31న నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు18వ అఖిలభారత మహాసభలో ప్రతినిధులు చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. నాలుగున జరిగే బహిరంగ సభ లో పాల్గొని కార్మిక సత్తా చాటాలని ఆటో డ్రైవర్లను కోరారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ అధ్యక్షులు శీను, అంజాత్ బాషా, శివవెంకటేష్ రెడ్డి, లింగం, సురేష్, మున్న అబ్దుల్లా, అయ్యస్వామి, డ్రైవర్లు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఆటోస్టాండులో జెండా ఎగురవేసి కార్యదర్శి ప్రభాకర్

దొంగ అరెస్టు..సొత్తు రికవరీ...

- వ్యక్తి అరెస్టు, మరొకరు పరారీ

ప్రజాశక్తి -కోడుమూరు

ముడుమలగుర్తి గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ తబ్రేజ్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ముడుమలగుర్తి గ్రామానికి చెందిన కురువ నాగేంద్ర సుమారు నాలుగేళ్ల క్రితం పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన చెందిన కవితను వివాహం చేసుకున్నారు. భార్యాభర్తల మధ్య కుటుంబ విషయాల్లో మనస్పర్థలు రావడం వలన ఇప్పటికి సుమారు ఒక సంవత్సరం కిందట అతని భార్య వదిలి పుట్టింటికి వెళ్లింది. అతడు అల్లరి చిల్లరగా తిరుగుతుండగా గత మూడు నెలల కిందట గొర్రెలు మేపే చోట గోరంట్ల గ్రామానికి చెందిన బోయఎల్లప్ప , కురువ నాగేంద్రకు పరిచయం అయ్యాడు. ఇద్దరు జల్సాలకు అలవాటు పడి ఇండ్లలో దొంగతనానికి అలవాటు పడ్డారు. గ్రామాల్లో తాళం వేసిన ఇండ్లను కనిపెట్టుకుంటూ ఉండి ప్లాన్ చేసేవారు. గోరంట్ల గ్రామనికి చెందిన రాము భార్య పిల్లలతో మహానంది దర్శనానికి వెళ్లిన విషయం గమనించారు. బోయ ఎల్లప్ప ఈ విషయం నాగేంద్రకు చెప్పగా, నవంబర్ 27న మధ్యాహ్నం 12.30 గంటలకు రాము ఇంటి తాళం పగలగొట్టారు. రెండు జతల బంగారు కమ్మలు, ఒక బంగారు చిన్న కమ్మలు, ఒక జత వెండి కాళ్ళ పట్టీలు, రూ.80,000 నగదు దొంగిలించారు. ముడుమలగుర్తి గ్రామానికి చెందిన మల్లికార్జున రెడ్డికి ఆరోగ్యం సరిగా లేనందన అతని భార్య ,కుమారునితో కలిసి చికిత్స కోసం కర్నూలుకు హాస్పిటల్ వెళ్లారు. అది గమనించిన వారు ఈ నెల 15న రాత్రి 11 గంటల సమయంలో మల్లికార్జున రెడ్డి ఇంటి తాళం పగలగొట్టి ఇంటిలో బెడ్ రూమ్‌లో ఉన్న బీరువా తాళం పగలగొట్టి ఒక బంగారు తాళిబొట్టు చైను, ఒక జత బుట్ట కమ్మలు , చెంపచారాలు, ఒక జత రాళ్ల కమ్మలు రెండు జతల కాళ్ల పట్టీలు, ఒక వెండి మొలతాడు దొంగిలించారు. దొంగలించిన పై రెండు కేసుల మొత్తం సొమ్ము విలువ రూ.6,13,000 ఉంటుంది. వారిద్దరు దొంగిలించిన సొత్తును తీసుకొని బెంగళూరు వెళ్లి జల్సాలు చేయాలనే ఉద్దేశ్యంతో సోమవారం కురువ నాగేంద్ర తన పొలంలో దాసిపెట్టిన సొత్తును తీసుకొని కోడుమూరు టౌన్‌లోని తాత గుడి దగ్గరికి వచ్చారు. ఎల్లప్పకు మందు తీసుకొని రమ్మని చెప్పి అతని కొరకు వేచియుండగా అక్కడ అంతలో పోలీసు వారు కురువ నాగేంద్ర ను అరెస్టు చేశారు. యెల్లప్ప పరారీలో ఉన్నాడు.

అరెస్టయిన నిందితుడు, ఆభరణాలతో సిఐ తబ్రేజ్ ,తదితరులు

వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

విచారించి చట్టపరంగా న్యాయం చేస్తాం

జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

చట్టపరంగా విచారణ చేసి న్యాయం చేస్తామని కర్నూలు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 84 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు శివశంకర్, రమేష్, విజయలక్ష్మి లు పాల్గొన్నారు.

అత్యధిక ఆక్సిడెంట్, బర్న్స్ కేసులకు చికిత్స

జిజిహెచ్ వైద్యులను అభినందించిన కెఎంసి ప్రిన్సిపల్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



జాతీయస్థాయిలో మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, న్యూఢిల్లీ లో ఈనెల 19న నిర్వహించిన ఆక్సిడెంట్, బర్న్స్ రివ్యూలో కెఎంసి పాల్గొంది. జా తీ య ం స్థా ం ం ం మేనేజ్‌మెంట్ ఆఫ్ ట్రామా, బర్న్స్ ఇంజ్యూరీస్ రివ్యూ లో రాష్ట్రస్థాయిలో కర్నూలు, కాకినాడ మెడికల్ కాలేజీలు పాల్గొన్నాయి. బర్న్స్ ఇంజ్యూరీస్ స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న కెఎంసి ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మంజులా బాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాభవాని కర్నూలు మెడికల్ కాలేజీ నుండి పాల్గొన్నారు. ఈ రివ్యూలో కర్నూలు మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నుండి రాష్ట్రంలోనే అత్యధికంగా 2024 సంవత్సరంలో 16,111 ట్రామా కేసులు, 212 బర్న్స్ కేసులకు వైద్యం అందించామని కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఇంత పెద్ద మొత్తంలో యాక్సిడెంట్ బర్న్స్ కేసులకు వైద్య సేవ అందిస్తున్నందుకు ఆయా విభాగాలను వైద్యులను ప్రిన్సిపల్ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.



నాయకులను సన్మానిస్తున్న జెసి

ఒక్క జిల్లా చేయలేరా..? : వైసిపి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా కావాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వైసిపి శ్రేణులు మండిపడ్డారు. వైసిపి హయాంలో ఆదోని జిల్లా కాలేకపోయిందని, కనీసం కూటమి ప్రభుత్వమైనా ప్రజల డిమాండ్‌ను నెరవేర్చి చిత్తశుద్ధిని చాటుకోవాలని హితవు పలికారు. ఆదోని జిల్లా సాధనకు జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 37వ రోజుకు చేరాయి. దీక్షలకు మద్దతుగా వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైసిపి మంత్రాలయం నాయకులు ప్రదీప్ రెడ్డి, వైసిపి రాష్ట్ర మహిళా నాయకులు శశికళ, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తనయుడు చంద్రశేఖర్ సంఘీభావం ప్రకటించి నిరాహార దీక్షల్లో కూర్చున్నారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రుద్ర గౌడ్, సురేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మహబూబ్‌బాషా, వ్యాపారవేత్తలు హనుభాయ్, జామిల్ షఫీ సంఘీభావం తెలిపారు. ఆదోని జిల్లా ఏర్పాటు అయ్యే వరకు జెఎసికి అండగా ఉంటామని తెలిపారు. చంద్రకాంత్ రెడ్డి, న్యాయవాదులు జీవన్ సింగ్, తబ్రేజ్, నాగరాజ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు వసీం, ఇంతియాజ్, నాయకులు సన్నీ, దేవా, నారాయణ, వెంకటేశ్వర రెడ్డి, ఎర్రిస్వామి, కౌన్సిలర్ లక్ష్మి, జెఎసి నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడ్, అశోక్ నంద రెడ్డి, దేవిశెట్టి ప్రకాష్, వ్యాపారులు రాజేష్ రెడ్డి ఉన్నారు.

మెడికల్ కళాశాలల

నిర్వహణ బాధ్యత ప్రభుత్వానిదే

- వామపక్షాల డిమాండ్

ప్రజాశక్తి - ఆదోని

మెడికల్ కళాశాలల నిర్మాణం ప్రభుత్వమే పూర్తి చేసి.. నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదోని బైపాస్ రోడ్డు నుంచి మెడికల్ కళాశాల వరకు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు, సిపిఐ పట్టణ కార్యదర్శి టి.వీరేష్ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్లు లక్ష్మణ రెడ్డి, కొరవి వినయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ రెడ్డి, కొరివి వినయ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కాంగ్రెస్ నాయకులు దిలీప్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాగరాజు, సిపియుఎస్‌యు రాష్ట్ర నాయకులు కోదండ, బీఎస్పీ జిల్లా నాయకులు రామలింగ మాట్లాడారు. పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని మండిపడ్డారు. గత వైసిపి ప్రభుత్వం 107, 108 జిఒలను తీసుకొచ్చి వైద్య విద్యను 50 శాతం ప్రయివేటీకరణ చేస్తే.. అప్పటిలో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి గగ్గోలు పెట్టిందని తెలిపారు. పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆందోళనలు చేపట్టిన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో 107, 108 జిఒలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా రద్దు చేయకపోగా.. పిపిపి విధానంలో వైద్య విద్యను ప్రయివేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. పిపిపి విధానం వల్ల వైద్య విద్యార్థులు నష్టపోవడంతో పాటు సామాన్యులు మెరుగైన వైద్యానికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు రూ.లక్షలు ఖర్చు పెట్టి ఇంటర్‌తో పాటు నీట్ శిక్షణకు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి చదివిస్తున్నారన్నారు. సీటులో అర్హతలు సాధించిన తర్వాత వారికి పిపిపి విధానం వల్ల రాష్ట్రంలో ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులో లేకుండా పోతాయని తెలిపారు. రాష్ట్రంలో జిఒ 590 ద్వారా 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పరిధిలోకి తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించిందిన చెప్పారు. వైద్య కళాశాలలను ప్రయివేట్‌కు అప్పగించడంతో ప్రభుత్వ భూములు, భవనాలు, ఆస్పత్రులు ప్రయివేట్ చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. వైద్య విద్య సీట్లు పెరుగుతాయన్న ప్రభుత్వ హామీలు అబద్ధపు మాటలేనని విమర్శించారు. ప్రభుత్వ వైద్య విద్యకు శాపంగా మారిన జిఒ 107, 108, 590ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి దస్తగిరి, పిడిఎస్ఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుమలేష్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు సోమలింగ, అఖండ, డిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉదయ్ మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావి రాజు, బసాపురం గోపాల్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి ఎంకప్ప, ఒబి.నాగరాజు, సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, సీనియర్ నాయకులు రామాంజనేయులు, ఈరన్న, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, మండల అధ్యక్షులు రామాంజనేయులు ఉన్నారు.

ధర్నాలో పాల్గొన్న వామపక్ష నాయకులు

అనుమతుల్లేని లాడ్జీల నిర్మాణాలను కూల్చేస్తాం

- కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో అనుమతులు లేని లాడ్జీల నిర్మాణాలను కూల్చేస్తామని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం స్థానిక అబోడే హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి నిర్మాణాలకు పంచాయతీ తీసుకోవాలని, జి ప్లస్ టు వరకు అనుమతి ఉంటుందని తెలిపారు. లాడ్జీల నిర్మాణాలకు కుడా అనుమతి తప్పనిసరి అని చెప్పారు. వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగించే లాడ్జీలకు కుడా అనుమతి లేకుండా ఉన్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా నిర్మించిన లాడ్జీలపై చర్యలు చేపడతామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గ అభివృద్ధిపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌కు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి వినతిపత్రం అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా వేసి సన్మానించారు. మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆధునికంగా బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. కౌతాళం మండలంలో స్వయంభుగా వెలిసిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సమస్యలపై లోకేష్ స్పందించి నియోజకవర్గ అభివృద్ధి తన బాధ్యత అని భరోసా ఇచ్చారు.

లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

రూ.38 లక్షలతో హెల్త్ క్లినిక్‌కు భూమి పూజ

ప్రజాశక్తి- దేవనకొండ

భూమి పూజ చేస్తున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

మండలంలోని పొట్లపాడు గ్రామంలో రూ.38 లక్షలతో హెల్త్ క్లినిక్ కేంద్రానికి రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ సోమవారం భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలకు గ్రామాల్లోనే వైద్యం అందించేందుకు హెల్త్ క్లినిక్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ ప్రతి పేదవారికీ ఉచితంగా వైద్యం అందించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. ఆలూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మల్లెపల్లి రంగడు, టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, మాజీ జడ్‌పిటిసి ఉచ్చీరప్ప, టిడిపి సీనియర్ నాయకులు రామారావు నాయుడు, మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, శాంతి కుమార్, గిడ్డయ్య గౌడ్, శ్రీనివాసులు, వెంకటేష్, సుధాకర్, రాజుగోపాల్ గౌడ్, చిన్న వెంకప్ప, తిమ్మప్ప, జనసేన నాయకులు కటిక ఉచ్చీరప్ప, రామాంజినేయులు, బంగి చంటిబాబు, ఆంథోని, బిజెపి మండల కన్వీనర్ బొల్లెద్దుల కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో ముందుకెళ్తాం

- టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జిల్లా అధ్యక్షులుగా గుడిసె ఆది కృష్ణమ్మ నియామకం కావడంతో సోమవారం టిడిపి నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణంలోని గుడిసె ఆది కృష్ణమ్మ ఇంటి నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు నివాళులర్పించారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ... తనపై ఇంత పెద్ద బాధ్యతను పెట్టిన ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు పార్లమెంటులో టిడిపి అభివృద్ధికి కృషి చేస్తానని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేస్తామని చెప్పారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నాయుడు నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, సౌదీ రావుఫ్, మారుతి నాయుడు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్, హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, రాష్ట్ర కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, సలీం, టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు తిమ్మప్ప, శివప్ప, టిడిపి నాయకులు ఉల్లిగయ్య, సురేష్ నాయుడు పాల్గొన్నారు.


మీనాక్షి నాయుడును కలిసిన గుడిసె ఆది కృష్ణమ్మ

అభ్యర్థులతో ఉన్న వైకుంఠం జ్యోతి

జాబ్‌మేళాకు విశేష స్పందన

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి - టిడిపి ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా హాజరయిన టిడిపి ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ... ప్రభుత్వం నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇస్తూ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తోందని తెలిపారు. యువత సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాకు 207 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా 67 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేష్ పాల్గొన్నారు.

వెనుకబడిన బ్లాక్‌ల

పనితీరు మెరుగుపరిచేందుకు కృషి

- సెంట్రల్ ప్రబారి ఆఫీసర్ బంగార్ రాజు

ప్రజాశక్తి - హొళగుంద

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వెనుకబడిన బ్లాక్‌ల పని తీరును, ప్రజా జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని సెంట్రల్ ప్రబారి ఆఫీసర్ బంగార్ రాజు తెలిపారు. సోమవారం హొళగుందలో ఆరోగ్య కేంద్రం, పశు వైద్యశాల, జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్, డిఆర్‌డిఎ (వెలుగు), రైతు సేవా కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పనితీరును పరిశీలించారు. ఇంకొంచెం వేగవంతంగా ముందుకెళ్లి సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు లోపాలు ఏమున్నాయో అధ్యయనం చేశారు. ప్రస్తుతం ప్రజలకు సేవలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చర్చించేందుకు ఆయా శాఖల అధికారులతో ఎంపిడిఒ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశ నిర్దేశం చేశారు. నీతి ఆయోగ్ ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. తహశీల్దార్ నిజాముద్దీన్, ఎంపిడిఒ విజయ లలిత, డిప్యూటీ ఎంపిడిఒ చక్రవర్తి, మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వెలుగు ఎపిఎం సూర్యప్రకాష్, రవిశంకర్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న బంగారు రాజు

జి రామ్ జి పేరును రద్దు చేయాలి

- వామపక్షాల డిమాండ్

ప్రజాశక్తి-ఆలూరు

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విబి జి రామ్ జి బిల్లును రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, కెపి.నారాయణస్వామి, సిపిఐ సీనియర్ నాయకులు భూపేష్, కారుమంచి మాట్లాడారు. గ్రామీణ పేదలకు అన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ చట్టాన్ని మార్చడం అన్యాయమని విమర్శించారు. 2005లో వామపక్షాల ఒత్తిడితో యుపిఎ ప్రభుత్వంలో ఉపాధి హామీ చట్టాన్ని సాధిస్తే మోడీ ప్రభుత్వం ఈ చట్టం నుంచి మహాత్మ గాంధీ పేరును తొలగించడంతో పాటు గ్రామీణ ఉపాధి హామీ రంగాన్ని కుదిస్తూ రాష్ట్రాలపై భారాలు మోపుతూ కొత్త చట్టం తేవడం సరికాదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కేవలం పేరు మార్చడమే కాదని, మొత్తం చట్టాన్ని కూడా మార్చిందని తెలిపారు. ఉపాధి అనేది కూలీల హక్కు ఆధారిత పథకమని, దీనిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తొలగించి బడ్జెట్ ఆధారిత పథకంగా మార్చిందని విమర్శించారు. కూలీలు హక్కులను కోల్పోయి దేశంలో భూస్వాములకు, కాంట్రాక్టర్లకు ఈ చట్టం వరంగా మారిందని తెలిపారు. రాబోయే కాలంలో జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించి గ్రామీణ పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ నాయకులు మైనా, కృష్ణ, వీరన్న, నాగరాజ్, వీరేష్, శేఖర్, విఠల్, ఈశ్వర్ గౌడ్, ఎస్ఎఫ్ఐ నాయకులు బసవరాజ్, ఉమేష్, సిపిఐ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, బాష, సిద్ధి లింగ, ఉలిగప్ప, ఆటో యూనియన్ నాయకులు బాలప్ప, కృష్ణ, శివ, బలరాం పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** సోమప్ప సర్కిల్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిపిఐ జిల్లా నాయకులు పి.పంపన గౌడ్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.గోవిందు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రాజు, నాయకులు జి.రంగన్న, బి.రాముడు, కె.ప్రసాద్, ఎం.రాజీవ్, అబ్దుల్, రమేష్, రాఘవరెడ్డి, దాదా గౌడు, ఏసేపు, నల్లన, బి.గోపాల్, కె.ఇస్మాయిల్, పక్కీరప్ప పాల్గొన్నారు.

ఆలూరులో నిరసన చేపడుతున్న నాయకులు

ఎమ్మిగనూరులో నిరసన చేపడుతున్న నాయకులు

IN THE COURT OF THE II ADDL.
DISTRICT JUDGE KURNOOL AT ADONI
O.S.No.12/2015

P. Siva Kumar .... Plaintiff
Vs
K. Sreenivasulu & others .... Defendants

SUIT SUMMONS TO THE DEFENDANTS

To
7. Talari Lakshmaiah, S/o Talari Hanumanna, R/o PALLEPADU Vil. & Post, Kosigi Mandal. Kurnool Dist.
8. B. Imran, S/o B. Iqbal, Muslim, aged about 45 years, business, r/o H.No. 1-677/A, Khooni Mohallah Street, Adoni town, Kurnool Dist.
9. Kydari Vijaya Kumar, S/o Kydari Nagaraj, business, r/o H. No. 1-2447, Military Colony, YEMMIGANUR-518 360. Kurnool Dist.

Whereas the plaintiff was instituted a suit against you for declaration. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions, On 07.01.2026 at 10.30 AM in the fore noon to answer the claim failing which the suit will be hear and determined in your absence.

(Court Order)

N. Mallikarjuna,
Advocate,
Yemmiganur 518 360
Kurnool Dist.
Mobile No.9848892777

చదువుతో కలిశాం.. స్నేహితులుగా నిలిచాం..!

- 30 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కౌతాళం

ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బీసీ) శ్రీశైలం (1994-1995) పదో తరగతి విద్యార్థుల 30 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం కర్నూలులో నిర్వహించడం ఆనందంగా ఉందని కౌతాళానికి చెందిన మాజీ పాత్రికేయుడు, స్వర్ణకార సంఘం అధ్యక్షులు లక్ష్మణాచారి పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'చదువుతో కలిశాం.. స్నేహితులుగా నిలిచాం.. ఈ కలయిక ఇలాగే కొనసాగిద్దామ'ని కర్నూలు నగరంలోని కెవిఆర్ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులతో పాటు, మిత్రులు అధిక సంఖ్యలో హాజరై నూతన ఉత్తేజాన్ని నింపారని వివరించారు. 30 ఏళ్ల తర్వాత మిత్రులు కలవడంతో ప్రతి ఒక్కరిలోనూ ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడంతో పాటు, పాఠశాలలో జరిగిన అనేక సంఘటనలను నెమరు వేసుకున్నారు. డప్పు, వాయిద్యాలతో ఉపాధ్యాయులకు ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాల జెండాలను ఆవిష్కరించారు. విరమణ పొందిన ప్రిన్సిపల్ అనసూయమ్మ, దామోదరం, దేవదానం, రామ్మూర్తి, ఎస్ఎం.బాష, రమణ, చంగమ నాయుడు, నారాయణస్వామి, తదితర ఉపాధ్యాయులతో పాటు కాలువ బుగ్గ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీని శాలువా, పూలమాలలు వేసి, మెమోంటులు అందజేసి సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ... 30 ఏళ్ల తర్వాత ఈ ఆనందాన్ని పంచుకోవడం తమకు ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. ఆయా రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలు ముందు కూడా నిర్వహించాలని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్వాహకులు నారాయణ, లక్ష్మణాచారి, నరసింహులు,

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వపు విద్యార్థులు

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

ఇబ్రహీంపురంలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

సమయపాలన ఎక్కడ..?

- సచివాలయ అధికారుల నిర్లక్ష్యం - సమస్యల వలయంగా గ్రామాలు..!

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం లో కొన్ని సచివాలయాల అధికారులు సమయపాలన పాటించడం లేదు. పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు చాలా సందర్భాల్లో కార్యాలయంలో కనిపిం చడం లేదు. కొంతమంది సచివాలయ సిబ్బంది విధులకు హాజరైనా పిడిఒలు మాత్రం దర్జాగా వారి సొంత పనులకు సమయానికి కేటాయిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెళ్లినా కొన్ని సచివాలయాల్లో పిడిఒలు మాత్రం కనిపిస్తున్నారు. మాచాపురం గ్రామానికి సంబంధించిన పిడిఒ వివరణ కోసం ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. ఇబ్రహీంపురం సచివాలయానికి వెళ్లి చూడగా అక్కడా పిడిఒ లేక ఖాళీ కుర్చీనే దర్శనమిచ్చింది. ఆమెను వివరణ కోరగా... 'ఉన్నతాధికారుల అనుమతి కోరాను. నందవరం గ్రామానికి వెళ్తున్నాను' అని తెలిపారు. మండల అధికారుల వివరణ కోరగా... 'ఆమె మా అనుమతి తీసుకోలేద'ని చెప్పారు. పిడిఒ రాలేదా అని సిబ్బందిని అడగగా తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తనిఖీలకు వెళ్లినప్పుడు మండల అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు, ఆదేశాలు జారీ చేస్తున్నారా..? వారి ఆదేశాలు ఏమవుతున్నాయి. చర్యలు ఎక్కడా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

సమస్యల వలయంగా గ్రామాలు

అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామాలు సమస్యల వలయంగా మారాయి. గ్రామాల్లో ఎటు చూసినా చెత్తాచెదారం, డ్రెయినేజీలు నిండి కంపు కొడుతున్నాయి. మాచాపురం గ్రామం ప్రధాన రహదారిలో శివాలయం పక్కన డ్రెయినేజీ నిండి దుర్వాసన వెదజల్లుతోంది. దేవాలయానికి వచ్చే భక్తులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేవాలయం దగ్గర కూర్చోవాలన్నా దుర్వాసనకు కూర్చోలేని పరిస్థితి ఏర్పడింది. ఇబ్రహీంపురంలో ఎటు చూసినా డ్రెయినేజీ కంపు కొడుతోంది. క్రిస్మస్ పండగ వస్తున్నా తమ వీధిని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ చేయకపోయినా కనీసం పండగ సమయంలోనైనా తమ వీధి వైపు రావాలని అధికారులను కోరారు.

మా అనుమతి తీసుకోలేదు

- ఎంపిడిఒ పుల్లయ్య

పిడిఒలు సమయపాలన పాటించకపోవడంపై ఎంపిడిఒను వివరణ కోరగా... 'వారు సెలవు తీసుకుంటున్నట్టు కానీ, సచివాలయానికి ఆలస్యంగా వెళ్తున్నట్లు కానీ మా అనుమతి తీసుకోలేద'ని తెలిపారు.

సమస్యను పరిష్కరిస్తాం

- గౌతమి, పిడిఒ ఇబ్రహీంపురం

గ్రామంలో డ్రెయినేజీలు నిండిన మాట వాస్తవమే. వాటిని త్వరగా శుభ్రం చేసి సమస్యను పరిష్కరిస్తాం.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా సోమవారం జిఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సత్య మాట్లాడారు. గణితం అంటే భయం కాదని, మన ఆలోచనా శక్తిని పెంచే సాధనమని తెలిపారు. కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, కోఆర్డినేటర్ వెంకటేష్, గణిత ఉపాధ్యాయులు రాజు, అన్నపూర్ణ, జ్యోత్స్న, ధరణి పాల్గొన్నారు. అలాగే భాష్యం పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ సురేంద్రబాబు మాట్లాడుతూ... రామానుజన్ కాలిబర్ టెస్ట్, రామానుజన్ మ్యాథ్స్ క్విజ్, రామానుజన్ మ్యాథ్స్ ఎక్స్‌పో, రామానుజన్ పజిల్ రౌండ్ వంటి కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ భార్గవ్ పవన్, ప్రధానోపాధ్యాయులు శిరీష, పాఠశాల గణిత ఉపాధ్యాయులు దినేష్, తాహిర్, జానకి, కుమారి, సహజాజి, గీత, శ్రావణి, రోజా ఉన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ హైస్కూల్‌లో గణిత దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంఇఒ రామాంజనేయులు, పాఠశాల యాజమాన్యం గణిత శాస్త్రవేత్త రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన నమూనాలను చూసి వాటి గురించి అడిగి తెలుసుకుని అభినందించారు. గణితానికి సంబంధించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, నమూనాలను చక్కగా చేసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. గత నవంబర్ 26న మాక్ పార్లమెంటులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, గణిత ఉపాధ్యాయులు జయలక్ష్మి, రామలక్ష్మి, భీమేష్, శ్రీను, ఈరన్న, ఉపాధ్యాయులు ఈరన్న, శిరీష, ముంతాజ్, శివశంకర్ పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని నిట్రవట్టి గ్రామంలోని 'ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌లో గణిత దినోత్సవం నిర్వహించారు. సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయులు కె.అయ్యన్న గౌడ్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు కిశోర్, గుమ్మల బాబు, రంగస్వామి, మధు, మంజుల, మెర్సీ ప్రసన్న, ప్రవీణ, కేజియా రాణి, అబ్దుల్ సలీం, జాకీర్ హుస్సేన్, మహబూబ్ బాషా, ఈరన్న పాల్గొన్నారు.



ఆదోని జిఎస్ఆర్ స్కూల్‌లో , భాష్యం పాఠశాలలో వేడుకలు

గోనెగండ్లలో...

హాలహర్విలో

కౌతాళంలో

నోటీసు

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడము ఏమనగా నా క్లయింట్ అయిన పఠాన్ ఖాజా మిన్నిల్ల హుస్సేన్ S/o. P. సుభాన్, ఇంటి నెంబర్: 1/1650-1, గాంధీ నగర్, ఎమ్మిగనూరు పట్టణం మరియు మండలం, వారు క్రింది తెలిపిన షెడ్యూల్ ఆస్తిని C.H. భాస్కర్ S/o C.H. దానియాల్, వారి నుండి విక్రయం పొందిన్నారు, సదరు ఆస్తి ని 14/11/2025 వ తేదిన పఠాన్ ఖాజా మిన్నిల్ల హుస్సేన్ S/o P. సుభాన్, గారి పేరున ఎమ్మిగనూర్ సి.రి.ఆ.లో 1వ పుస్తకము ద.నెం 10328/2025గా విక్రయ రిజిస్టరు చేయించియున్నారు. మరియు సదరు ఆస్తి కి సంబందించిన దస్తావేజు యొక్క లింక్ డాక్యుమెంట్ నెంబర్: 3162/1982, తేది 04/12/1982, గల దస్తావేజును పోగొట్టుకున్నారు అని తెలిపి దస్తావేజును అందజేయలేదు. కావున సదరు ఆస్తి కి సంబందించిన దస్తావేజు యొక్క లింక్ డాక్యుమెంట్ నెంబర్: 3162/1982, తేది 04/12/1982, పై సర్వాధికారములు నా క్లయింట్ కు కలవు. ఈ ఆస్తి పై ఎవ్వరికైనా ఎలాంటి హక్కు కానీ అధికారము కానీ ఆక్షేపణలు ఉన్న ఎడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రెస్ న్యాయవాదిని కలిసి మీ యొక్క హక్కులు కానీ అధికారములు ఆక్షేపణలు కానీ నిరూపించుకొనవలెను. లేని ఎడల ఏలాంటి ఆక్షేపణలు లేవు అని బావించ బడును అని యావన్మందికి తెలిపరచడమైనది.

కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు సబ్ జిల్లా, ఎమ్మిగనూరు మున్సిపల్ లోని ఆస్తి వివరములు
ఇంటి నెంబర్: 1/1648, ప్లాట్ నెంబర్ : 150
సర్వే నంబరు : 280A/1B

స్థలం కొలతలు:-
తూర్పు: పడమర: 30 అడుగులు
ఉత్తరం: దక్షిణం 45 అడుగులు
విస్తీర్ణం: 150 చ. గ
చెక్కుబంది:
తూర్పుబీ ప్లాట్ నెంబర్: 13 నందు గల D.No: 1/1649 గల M. బసన్న ఇల్లు
పడమర: ప్లాట్ నెంబర్ 11 నందు గలD.No: 1/1648-1 గల సోమశేఖర్ ఇల్లు
ఉత్తరం: D.No: 1/1639 గల ఈడిగ అంజినేయులు ఇల్లు, దక్షిణం: 24 అడుగుల వెడల్పు గల రోడ్.

ఇట్లు
ANGADI DINESH, Advocate
#18/461-1, 1st Floor, Sri Lakshmi Devi Complex, Court road, Yemmiganur-518 360
Mobile; 9949390767, 7989749530
Bar counsel number AP/1394/2020

అన్నను చంపించిందనే కక్షతో వదిన హత్య

- తోగలగల్లులో దారుణం - అనాథలైన చిన్నారులు

గంగావతి (ఫైల్)

ప్రజాశక్తి - ఆస్పరి

తన అన్నను చంపించిందనే కక్షతో వదినను హత్య చేసిన సంఘటన మండలంలోని తోగలగల్లు గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం సిఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు... తోగలగల్లు గ్రామానికి చెందిన గొల్ల అహోబిలం కలప్రి గ్రామానికి చెందిన గంగావతిని 8 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. గంగావతికి కర్ణాటకకు చెందిన చెన్న బసవతో వివాహేతర సంబంధం ఉండేది. గంగావతి స్వగ్రామమైన కలప్రికి సెప్టెంబర్ 4న భర్త అహోబిలంతో కలిసి వచ్చారు. మాల పున్నమి పండగ ముగించుకొని అహోబిలం ఒక్కడే స్వగ్రామమైన తోగలగల్లుకు బైక్‌పై వెళ్తుండగా కర్ణాటకకు చెందిన చెన్న బసవ కాపు కాచి హత్య చేశాడు. భార్య గంగావతి సూచన మేరకే ఈ హత్య జరిగినట్లు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈ కేసులో గంగావతి బెయిల్‌పై అక్టోబర్ 28న వచ్చారు. గంగావతి భర్త గ్రామమైన తోగలగల్లులోనే కాపురం ఉండేవారు. తన అన్నను చంపించిందన్న కక్ష పెంచుకున్న గొల్ల పెద్దయ్య ఆదివారం అర్ధరాత్రి గంగావతి ఇంటికి వచ్చారు. గంగావతిపై దాడికి ప్రయత్నించగా ఆమె తండ్రి చిన్న ఉరుకుందు అడ్డుకోబోయారు. పెద్దయ్య ఆయనను బయటకు తోసేశారు. ఇంట్లో ఉన్న రోకలి బండతో దాడి చేసి హత్య చేశారు. మృతురాలి తండ్రి ఉరుకుందప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

అనాథలైన చిన్నారులు

అనాథలైన చిన్నారులు : వివాహేతర సంబంధం కారణంగా గంగావతి భర్త అహోబిలంను చంపించగా తన అన్నను చంపించిందన్న కక్షతో గొల్ల పెద్దయ్య వదిన గంగావతిని చంపడంతో అహోబిలం, గంగావతి పిల్లలు గొల్ల శశి వర్ధన్, గొల్ల ఉషశ్రీ అనాథలుగా మిగిలారు. తల్లిదండ్రులను కోల్పోయి బిక్కుబిక్కుమంటూ తల్లి మృతదేహం వద్ద రోధిస్తున్న చిన్నారులను చూసి గ్రామస్తులు చలించిపోయారు. పెద్దలు చేసిన తప్పునకు పిల్లలు బలయ్యారంటూ కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి చిన్నారుల భవితకు అండగా ఉండాలని గ్రామస్తులు కోరారు.

ఎన్ఆర్ఇజిఎస్‌ను నిర్వీర్యం చేస్తే సహించం

ప్రజాశక్తి -కోడుమూరు

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్పుతో నిర్వీర్యం చేయాలని చూస్తే సహించబోమని వామపక్ష పార్టీలు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కోట్ల సర్కిల్లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలని, వికసిత్ భరత్ జిరామ్‌జి పేరును తొలగించాలని నినాదాలు చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు గపూర్మియా అధ్యక్షత వహించారు. సిపిఎం మండల కార్యదర్శి కామర్తి రాజు, సిపిఐ మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేకతకు పాల్పడుతుందనివిమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును తొలగించి వికసిత్‌భారత్ జి రాంజీ పేరుతో ఈ పథకాన్ని ఎత్తివేయడానికి ప్రధాని మోదీ దుష్ట పన్నాగాలు పన్నుతున్నారని అన్నారు. ఆంగ్లేయ పాలన నుంచి భారతదేశాన్ని స్వాతంత్ర్య ఉద్యమం దిశగా నడిపించిన పూజ్య బాపూజీ పేరు ప్రపంచమంతటా మారుమోగితే ఈ బిజెపి ప్రభుత్వానికి మహాత్మా గాంధీ పేరు నచ్చడం లేదని, హిందుత్వ వాదంతో జిరాంజీ పేరు పెడుతోందని పేరు మార్పుతో ఏమి వొరుగబెడతారోనని అన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శిబికెఎంయు నియోజకవర్గ కార్యదర్శి శేష్ కుమార్, సిఐటియు మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రాముడు, తిమ్మప్ప,ఆటో యూనియన్ నాయకులు మధు, హమాలీ సంఘం నాయకులు బజారి, వెంకటేశ్వర్లు, సుంకన్న,మద్ది, ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం నాయకులు సులోచనమ్మ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మునిస్వామి,పట్టణ కార్యదర్శి రామాంజనేయులు,నాగేష్, వెంకటస్వామి, అలీసా, కొళాయిల రాముడు, రుద్రప్ప,చేనేత కార్మిక సంఘం నాయకులు భాష, మల్లయ్య, కిషోర్,శేఖర్, మునిస్వామి సిఐటియు నాయకులు లక్ష్మన్న పాల్గొన్నారు.

నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గపూర్‌మియ్యా

దుబాయ్‌లో ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

ముఖ్యఅతిథిగా హాజరైన వైసిపి పిఎసి సభ్యులు హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వైసిపి ఎన్ఆర్ఐ వింగ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను దుబాయ్‌లోని క్రూయిజ్ షిప్‌పై ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఎన్ఆర్ఐలు హాజరై, జగనన్న నాయకత్వంపై తమ మద్దతు , అభిమానాన్ని తెలియజేశారు. ఈ వేడుకల్లో వైసిపి ఎన్ఆర్ఐ వింగ్ గ్లోబల్ కోఆర్డినేటర్ సాంబశివరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైసిపి పిఎసి సభ్యుడు హాఫీజ్ ఖాన్, ఎన్ఆర్ఐ వింగ్ ప్రతినిధులు, గల్ఫ్ కోఆర్డినేటర్ ఇల్యాస్, గోవిందు నాగరాజ్, జిలాన్, అక్రమ్, చక్రి, అబ్దుల్లా, జిఆర్ఆర్. రెడ్డి తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. వైసిపి నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అమలు చేసిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, ఇంటి వద్దకే పాలన (డోర్ స్టెప్ డెలివరీ), పోర్టులు, షిప్పింగ్ హార్బర్ అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, భారీ పెట్టుబడుల ఆకర్షణ వంటి రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రస్తావించారు. కోవిడ్ కారణంగా దాదాపు రెండేళ్లు ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ప్రభుత్వం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఎన్ఆర్ఐలు అందరూ ఐక్యంగా నిలిచి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం జగనన్న విజనరీ పాలనను మళ్లీ తీసుకురావడానికి పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరితమైన వేడుకలతో ముగిసింది. రానున్న కాలంలో వైసిపి అండగా నిలుస్తామని ఎన్ఆర్ఐలు దృఢ సంకల్పం వ్యక్తం చేశారు.

వైసిపి ఎన్ఆర్ఐ నాయకులకు కేక్ తినిపిస్తున్న హాఫీజ్‌ఖాన్

టిడిపి జిల్లా అధ్యక్షులు గౌరుచరితకు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తెలుగు దేశం పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను రాష్ట్ర పార్టీ అధిష్టానం ప్రకటించిన అనంతరం తొలిసారి కర్నూలు జిల్లా కార్యాలయాలనికి వచ్చిన సందర్భంగా సోమవారం ఆమెను ఘనంగా సన్మానించారు. టిడిపి ప్రధాన కార్యదర్శి నాగరాజుయాదవ్, కెడిసిఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, స్వాగతం పలికారు. ఎన్‌టిరామారావు విగ్రహానికి ముందుగా గౌరుచరితతో కలిసి పూలమాల వేశారు. వారు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర పార్టీ ధ్యక్షులు పల్లా శ్రీనివాసులు తన పై ఎంతో నమ్మకంతో రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన దేశ రాష్ట్రపతి, భారత దేశ ప్రధాన మంత్రిని అందించిన నంద్యాల జిల్లాకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకమునకు సహకరించిన జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రానున్న రోజులలో నంద్యాల జిల్లా నాయకుల సహకారంతో తెలుగుదేశంపార్టీ అభ్యునతికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చెసిన కేక్ ను గౌరు చరితా రెడ్డి కట్ చెసి ఒకరి ఒకరు పంచుకోని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలి

- జిల్లా సాధన సమితి నాయకులు

నిరసన తెలియజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆదోని జిల్లా ఏర్పాటు చేస్తేనే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆదోని జిల్లా సాధన సమితి నాయకులు నాగన్న, స్వామిదాసు, నరసన్న తెలిపారు. సోమవారం మండలంలోని కలుగొట్ల గ్రామ పరిధిలో ధర్నా చేపట్టారు. డివిజన్ కంటే అతి తక్కువ జనాభా విస్తీర్ణం ఉన్న వాటిని జిల్లాలు చేశారని, ఆదోని డివిజన్ అత్యంత వెనుకబడిన ప్రాంతమని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, అక్షరాస్యతాపరంగా కూడా వెనుకబడిందని చెప్పారు. ఆదోని జిల్లాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

టిడిపితోనే వాల్మీకులకు న్యాయం

- మండల అధ్యక్షులు రామిరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

టిడిపితోనే వాల్మీకులకు న్యాయం జరుగుతుందని, వాల్మీకుల అభివృద్ధిని కోరే ఏకైక పార్టీ టిడిపి అని టిడిపి మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, ముత్తిరెడ్డి తెలిపారు. సోమవారం నూతనంగా ఎన్నికైన టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మను కలిసి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో గుడిసె కృష్ణమ్మ రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్‌గా, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పలు బాధ్యతలను చేపట్టారని తెలిపారు. బీసీ కోటాలో మహిళకు రావటం హర్షించదగ్గ విషయమన్నా రు. జిల్లాలో మొట్టమొదటి అధ్యక్ష పీఠం అధిష్టించబోతున్న తొలి మహిళ కృష్ణమ్మ కావటం విశేషమన్నారు. గతంలో ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకుని కొనియాడారు. ప్రతి ఒక్క కార్యకర్త సైనికునిలా పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి కార్యకర్తకు రాబోయే రోజుల్లో న్యాయం జరుగు తుందని, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి కోరే పార్టీ టిడిపినేనని తెలిపారు. టిడిపి మండల నాయకులు జ్ఞానేష్, నర్సిరెడ్డి, తోవి రామకృష్ణ, బసన్న, గుండేష్ పాల్గొన్నారు.

గుడిసె కృష్ణమ్మను కలిసిన కోసిగి మండల నాయకులు

ఇఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి -కోడుమూరు

మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారి అభ్యున్నతికి ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ కృషి చేస్తుందని ఇఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎస్తేరు రాణి అన్నారు.కోడుమూరు పట్టణంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించానే లక్ష్యంతో ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు. టైలరింగ్ శిక్షణ ద్వారా మహిళలు ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందే అవకాశం ఉందని ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం అందజేస్తామని తెలిపారు. ఈ శిక్షణ కేంద్రం కోడుమూరు పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీ, బిసి కాలనీ, కృష్ణాపురం గ్రామం, ఎర్రబాడు గ్రామం వరకు గ్రామ ప్రాంతాల్లో కూడా టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కల్పించేలా సహకారం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇఆర్. ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా వృద్ధాశ్రమం నిర్వహించుట, అనాథ ఆశ్రమం ,బ్లడ్ డొనేషన్ క్యాంప్స్, ఉచిత మెడికల్ క్యాంపు, నిరుద్యోగులకు కమ్యూనికేషన్ స్కిల్స్, కుటీర పరిశ్రమల నిర్వాహణకు అవగాహన కల్పించడం, మహిళలకు ఉపాధి కొరకు కుట్టు మిషన్ టైలరింగ్ నేర్పుట, అనాథ , పేద పిల్లలకు విద్యను అందించుట, పేదలకుబట్టలు, ఆహారంఅందించడం ఈ సంస్థ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ అధ్యక్షులు గేరా షారోన్, సంపూర్ణరావు, వీర రత్నరాజు, సువార్తమ్మ, ఎస్తేరు రాణి కర్నూలు జిల్లా అధ్యక్షులు, కె.సల్మాన్ రాజు మండల అధ్యక్షురాలు, కె.జీవనజ్యోతి, కె.సత్యనారాయణ వార్డ్ మెంబర్ షఫీ, ఫౌండేషన్ సభ్యులు, స్థానిక నాయకులు మహిళలు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణా కేంద్రం ప్రారంభిస్తున్న ఎస్తేరురాణి

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజు యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

టిడిపి నూతన జిల్లా ప్రధాన కార్యదర్శిగా టిడిపి నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు టిడిపి అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మోక్షగుండం విశ్వేశ్వర సర్కిల్ వద్ద ఉన్న వ్యక్తిగత కార్యాలయంలో పలువురు టిడిపి నాయకులు అభిమానులు కార్యకర్తలు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యాలయం ముందు భారీ ఎ త ౦ న బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

విశ్వాసానికి పట్టం : టిడిపి రాష్ట్ర పరిశ్రమలు ఆహార శుద్ధి శాఖ మంత్రి టిటి భరత్ కు అత్యంత సన్నిహితునిగా, నిత్యం ఆయన అడుగుజాడల్లో లైన్ అనుసరిస్తూ అత్యంత విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. ప్రధానంగా ఎన్నికలకు ముందే వైసిపి అధికారంలో ఉండగానే అధికార పార్టీని వీడి టిడిపిలో చేరారు. టిడిపి నగర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించి నగరంలో పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. ఈ నేపథ్యంలో పార్టీలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సాధించు కున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ పట్ల నిబద్ధతతో చేసిన కృషికి, విశ్వాసానికి గుర్తింపుగా నేడు పార్టీ అధిష్టానం ఆయనకు ఈ పదవిని కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ అభివృద్ధి కోసం తన సాయి శక్తులా కృషిచేస్తానని, తనకు తన కృషిని గుర్తించిన అవకాశాన్ని కల్పించిన టిడిపి అధినేత ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి లోకేష్ కు, టిజీ భరత్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సిల్వర్ జూబ్లీలో గణిత దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ దేవికా రాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ దేవికారాణి, ప్రపంచ గణిత మేధావి రామానుజన్ పని అనేకులను ప్రభావితం చేసిందన్నారు. 13 సంవత్సరాల వయసులో అధునాతన గణితం అధ్యయనం చేసిన రామానుజన్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నాగరాజ్ శెట్టి పరిశోధన అనువర్తనాలు తెలిపారు. టాలెంట్‌టెస్ట్, క్విజ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఏలూరు ఆర్టీసీ డిపో పెట్రోల్ బంక్ అవుట్‌లెట్‌లో జరిగిన అవినీతి కుంభకోణంతో సంబంధం లేని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్. సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేసి తక్షణం విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.అజీమ్ ఖాన్, మాజీ కోశాధికారి జె. దివాకర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, జిల్లా నాయకులు కెసి.శేఖర్, ఎస్ఆర్‌కె రెడ్డి, పివై. ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. సోమవారం వారు జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుంభకోణంలో దోషులైన ఇడి, జోనల్‌అధికారి, జిల్లా ప్రజారవాణా అధికారిని బాధ్యులను చేయకుండా, కక్షసాధింపుతో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకుడిని లక్ష్యంగా చేసుకున్నారన్నారు. ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని, సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని వారు కోరారు.

కాటాలను ఆకస్మిక తనిఖీ చేసిన కార్యదర్శి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మార్కెట్ యార్డ్ కార్యదర్శి జయలక్ష్మి పర్యవేక్షక సిబ్బందితో కలిసి సోమవారం కాటాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులు కాటాలు జరుగు సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కాటాలలో ఏదైనా వ్యత్యాసం ఉంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. పర్యవేక్షక సిబ్బంది ప్రతిరోజూ కాటాలు తనిఖీ చేయాలని ఆదేశించారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

డాక్టర్ కెవిసుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల కరెస్పాండంట్ విజయ లక్ష్మమ్మ మాట్లాడుతూ రామానుజన్ గణిత శాస్త్రానికి చేసిన కృషి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ఆయన జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. గణిత శాస్త్రం ప్రతి ఇంజినీరింగ్ శాఖకు పునాదిగా నిలుస్తుందని, విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ గణితశాఖ అధ్యాపకులు, ఇతర విభాగాల అధిపతులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ గణిత దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

నూతన ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు కు చెందిన ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో కర్నూల్ 3 టౌన్ ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన ఎపి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు లింగం బాలకృయ్య, సిపిఐ నాయకులు బజారి, హమాలి వెంకటేశులు కలిసి పట్టు శాలువాతో పూల బొకేతో సన్మానించారు. ఎస్ఐ ఎపి శ్రీనివాసులు కోడుమూరులో రెండుసార్లు పనిచేసి మంచి పేరు సంపాదించారని, చిప్పగిరి, దేవనకొండ, కర్నూలు ఫోర్త్‌టౌన్‌లో పనిచేసి ఏడు నెలల్లోనే మూడుసార్లు బదిలీ అయినా మంచి ఎస్ఐ పేరు పొందారని అన్నారు. త్వరలో పదోన్నతి పొంది కోడుమూరు సిఐగా రావాలని కోరారు.

వయస్సుతో నిమిత్తం లేకుండా కిడ్నీమార్పిడి

-60 ఏళ్ల అమ్మమ్మ నుంచి 19 ఏళ్ల మనవరాలికి కిడ్నీ మార్పిడి

ప్రజాశక్తి-కర్నూలుహాస్పిటల్

మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలులో నాలుగో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సలో 60 ఏళ్ల అనసూయమ్మ తన 19 ఏళ్ల మనవరాలు రేవతికి కిడ్నీ దానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మమ్మ తన మనవరాలి జీవితానికి కొత్త జీవితాన్ని అందించడం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. ఈ ఘటన ద్వారా వృద్ధ వయస్సులో ఉన్నవారు కూడా సరైన వైద్య పరీక్షల అనంతరం కిడ్నీ దానం చేయవచ్చని వైద్యులు స్పష్టంగా తెలిపారు. వయస్సు కంటే ఆరోగ్య పరిస్థితి ముఖ్యమని, సరైన ఫిట్‌నెస్ ఉంటే వృద్ధులు కూడా అవయవ దాతలుగా ముందుకు రావచ్చని వారు పేర్కొన్నారు. ఇది సమాజానికి ఒక కీలక అవగాహన సందేశంగా నిలుస్తోందన్నారు. ఈ కీలక శస్త్రచికిత్సను డాక్టర్ ఎస్.అబ్దుల్ సమద్ (యూరాలజిస్ట్), డాక్టర్ సిద్ధార్థ్ హెరూర్ (నెఫ్రాలజిస్ట్), డాక్టర్ ఎన్. శివ ఫణీంద్ర (అనస్తీషియాలజిస్ట్) ఆధ్వర్యంలో అనస్తీషియా టీమ్, సహాయక నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం దాత, గ్రహీత ఇద్దరూ ఆరోగ్యంగా కోలుకుంటున్నారు. ఈ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా నిర్వహించడం విశేషం. దీని వల్ల బాధిత కుటుంబానికి ఆర్థిక భారం లేకుండా అత్యాధునిక చికిత్స అందించగలిగామని వైద్యులు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థితి ఎలా ఉన్నా ప్రతి రోగికి అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే మా లక్ష్యమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కిడ్నీ మార్పిడి వంటి ఖరీదైన చికిత్సలను విజయవంతంగా నిర్వహించడం మా ఆసుపత్రి సామర్థ్యాన్ని నిరూపిస్తోందని అన్నారు. ఈ విజయానికి కారణమైన వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని ఆయన అభినందించారు. రోగి కుటుంబ సభ్యులు మెడికవర్ హాస్పిటల్స్ వైద్య బృందానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నాపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలు : జ్ఞానేశ్వర్ గౌడ్

ప్రజాశక్తి-వెల్దుర్తి : తనపై ఇటీవల కొంతమంది చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలు, కల్పితమని మాజీ ఎంపిపి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎల్ఇ జ్ఞానేశ్వర్ గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం వెల్దుర్తిలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధి కోసం తాను చేపడుతున్న కార్యక్రమాలను ఓర్వలేక కొందరు తనపై, తన వారిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తాను ఎలాంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనలేదని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం, సరికాదని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగావకాశాల కల్పనకు జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని, తాగునీటి సదుపాయాలు, రహదారుల అభివృద్ధి, పేదలకు సహాయ కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. అంతర్గత ఆరోపణల వల్ల పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని, అందరూ కలిసిమెలిసి పనిచేస్తేనే పార్టీకి, గ్రామానికి మేలు జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ టిడిపి మండల అధ్యక్షుడు జయరాముడు, మాజీ జడ్‌పిటిసి ఐజయ్య, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ఛైర్మన్ సూరి, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, హరి,నాయకులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్‌కు అథ్లెట్లు ఎంపిక

ప్రజాశక్తి కర్నూలు జిల్లాపరిషత్

భారతదేశంలో పిల్లలకు అందించే అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్‌కు ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఎఎంఎఫ్)కు చెందిన పారా అథ్లెట్లు శివాని, జ్యోతి ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని న్యూఢిల్లీలో ఈనెల 26న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లా మద్దికేర గ్రామానికి చెందిన శివాని, హర్యానాకు చెందిన జ్యోతి ఇద్దరూ ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందుతున్న పారా అథ్లెట్లు. పారా క్రీడల్లో అసాధారణ ప్రతిభ, పట్టుదల, నిరంతర శ్రమకు గుర్తింపుగా వీరు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. శివాని పారా అథ్లెటిక్స్‌లో జావెలిన్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో, జ్యోతి డిస్కస్‌త్రో, షాట్‌పుట్, జావెలిన్ త్రో విభాగాల్లో విశేష ప్రతిభను కనబరుస్తున్నారు. గత నాలుగేళ్లుగా వీరు చూపిన అంకితభావం, క్రమశిక్షణ, అచంచలమైన సంకల్పశక్తికి ఇది నిదర్శనం. వీరి గ్రాస్‌రూట్ స్థాయి నుంచి పూర్తి శిక్షణకు ఆదిత్య మెహతా ఫౌండేషన్ మద్దతు ఇచ్చింది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం పారా క్రీడల్లో వీరి ప్రతిభకు లభించిన అత్యున్నత జాతీయ గుర్తింపుగా చెప్పవచ్చు. ఈ విజయానికి సహకరించిన ఇన్వెస్కో, ఫ్లట్టర్, జిఎంఎంసిఐ, ఆల్కాన్‌కు ఆదిత్య మెహతా ఫౌండేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఆదిత్య మెహతా ఫౌండేషన్ పారా అథ్లెట్లకు శిక్షణ, పునరావాసం, మార్గదర్శనం, పోటీ అవకాశాలు కల్పిస్తుంది. మరిన్ని వివరాలకు 9959154371/ 9963980259 నంబర్లకు సంప్రదించాలని ఫౌండేషన్ వారు తెలిపారు.

అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆదోని

చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోందని, ప్లాట్ ఫారంపై ఆరుబయట నిద్రించే వారికి దుప్పట్ల ద్వారా ఉపశమనం కలుగుతుందని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. సోమవారం అభాగ్యులకు లయన్స్ క్లబ్ సౌజన్యంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చలితో సతమతమవుతున్న వృద్ధులకు, మహిళలకు, చిన్నపిల్లలకు ప్రతేడాది ఆదోని లయన్స్ క్లబ్ సౌజన్యంతో దుప్పట్లు పంచడం ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. తెల్లవారుజామున రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, రహదారి పక్కన అరుగులు మీద, దేవాలయాల దగ్గర పడుకొని ఉన్న వారికి దుప్పట్లు కప్పినట్లు తెలిపారు. జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, విశిష్ట సభ్యులు ఓం ప్రకాష్, నీల మోహన్, పాడేగల్లు మురళీధర్, గోవిందరాజమూర్తి, ఉషా రావు, కిరణ్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గోపీనాథ్

'సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

డీఎస్సీ-2025 ఉపాధ్యాయులకు ప్రాన్ నెంబర్స్ (పరమనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్) జనరేట్ చేసి ఉపాధ్యాయుల జీతాల్లో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని, డిసెంబర్ జీతాలను సకాలంలో చెల్లించేందుకు కృషి చేయాలని యుటిఎఫ్ మండల రూరల్, అర్బన్ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ రాజు, గురుస్వామి డిమాండ్ చేశారు. సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో సబ్ ట్రెజరీ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు నాగమణి, బిజి.మాదన్న, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుధాకర్, మండల ఆర్థిక కార్యదర్శి సంజన్న పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరును జిల్లా కేంద్రం చేయాలి

- ఎమ్మిగనూరు జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరును జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని సోమప్ప కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి నిరసన చేపట్టారు. జెఎసి నాయకులు రంగయ్య, రాజేష్, దేవదానం, చార్లెస్ మాట్లాడుతూ... ఆదోనిని వ్యతిరేకించడం లేదని, ఎమ్మిగనూరు ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేయాలని జిల్లాగా ప్రకటించాలని కోరుతున్నట్లు తెలిపారు. నాయకులు చార్లెస్, స్వామి, రాము, రాజోలప్ప, నాని, గోవింద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మానవహారం నిర్వహిస్తున్న నాయకులు

బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

'ఉపాధి'ని యథావిధిగా కొనసాగించాలి

• కొత్త చట్టాన్ని రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వ పతనం తప్పదు • వామపక్ష నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, భారత జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి విబి జి రాం జిగా పేరు మార్పు చేసి చట్టం చెయ్యడాన్ని ఉపసంహరించుకోవాలని, రాష్ట్రాలపై 40 శాతం నిధులు భారం వేయడాన్ని నిరసిస్తూ సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో నూనెపల్లి జంక్షన్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి అనంతరం ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డ్వామా పీడీ సూర్యనారాయణకు సమర్పించారు. కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి డి.లక్ష్మణ్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు లు అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేటర్ సంస్థలకు రుణాలను 11 సంవత్సరాల కాలంలో 17 లక్షల కోట్లకు పైగా చేయించిందని కానీ దేశం అభివృద్ధి చెందాలంటే పల్లె ప్రాంతాలు అభివ ద్ధి చెందాలి గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఏకైక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం కోసం గత 11 సంవత్సరాల కాలంలో అరకోర నిధులు కేటాయించి పూర్తిగా ఎత్తివేయాలని దురుద్దేశంతో వి బి- జి రామ్- జి అనే పేరు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వెంటనే విబి-జి రామ్ -జీ పేరును రద్దు చేసుకోవాలని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 60 శాతం మాత్రమే ఇస్తామని మిగిలిన 40 శాతం రాష్ట్రాలే భరించాలని తెలిపారన్నారు. కంద్రం ఎప్పుడు పని మొదలు పెడుతుందో కేంద్రమే తెలియజేస్తుందని రాష్ట్రాలకు ఎలాంటి హక్కు లేదని చెప్పడం చాలా దుర్మార్గమని, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ పథకం అందకుండా నిర్వీర్యం చేసి పూర్తిగా ఎత్తివేయాలని దురుద్దేశంతో దుర్మార్గమైన విధానాన్ని అనుసరిస్తుందని, గాంధీని దేశమంతా జాతిపితగా గౌరవిస్తుంటే, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పాలన సాగిస్తున్న బిజెపి మహాత్మా గాంధీ పైన ఉన్న అక్కస్సును వెళ్లగక్కుకునేందుకు గాడ్సే వారసులమంటూ నిరూపించుకునేందుకు పేరు మార్చుతూ లోక్సభలో ప్రవేశపెట్టడం లౌకిక పార్టీలన్నీ వ్యతిరేకించిన బలం ఉందని ఆమోదించుకోవడం దుర్మార్గమని అన్నారు. వెంటనే రాష్ట్రపతి ఆమోదం తెలిపి చట్టాన్ని తీసుకురావడం జాతిపిత మహాత్మ గాంధీని మరోసారి హత్య చేయడమేనని, గాంధీజీ పేరును పలుకబోము అలా పిలిచే ఏ పథకమైనా రద్దు చేస్తామని ప్రజలకు సంకేతాన్ని ఇచ్చిందని అన్నారు. రాబోయే కాలంలో కార్మికులు వ్యవసాయ కార్మికులు కలిసి ఉద్యమాలు ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వానికి చరమగీతం పాడేలా పోరాటాలు చేయాలని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంను యధావిధిగా కొనసాగించి 200 రోజులు పని దినాలు కల్పించి,600 రూపాయలు రోజువారి కూలీ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రెండు లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించాలని లేకుంటే బిజెపి ప్రభుత్వం పతనం కాక తప్పదని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి రామచంద్రుడు, నరసింహ నాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, సిపిఐ జిల్లా నాయకులు మురళీధర్, డి శ్రీనివాసులు, సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహ, కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం, మౌలాలి,సిపిఎం మండల కార్యదర్శి వెన్న బాల వెంకట్, వామపక్ష ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో ప్రదర్శన చేపడుతున్న నాయకులు

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

అర్జీలను నాణ్యతగా, వేగంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా - పిజిఆర్ఎస్కు 276 అర్జీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించే ప్రతి అర్జీని అత్యంత నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, పారదర్శకతతో, అర్జీదారులు సంత ప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించే విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలను సందర్శించి పర్యవేక్షించనున్న నేపథ్యంలో, అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. రీ-ఓపెన్ అయిన దరఖాస్తులు, బియాండ్ ఎస్-ఎల్ఏలో ఉన్న అర్జీలు, వీఐపీ గ్రీవెన్స్లను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్లో ఉన్న ఆడిట్ కేసులపై ప్రత్యేక ద ష్టి సారించి, నిర్ణీత కాల పరిమితిలోగా వెంటనే క్లియర్ చేయాలని సూచించారు.

ఎస్టీ వసతి గృహాల్లో

మెరుగైన వసతులు కల్పించాలి

- గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో పనిచేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప పేర్కొన్నారు. సోమవారం ఎస్బిఐ కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాల సెమినార్ హాలులో ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాగా ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి విశేష కృషి చేయడం జరుగుతుందన్నారు. అధికారులు ఎస్టీ వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించి విద్యార్థుల శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. గిరిజన వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందని వచ్చే ఏడాది ప్రతి వసతిగృహంలో 100 శాతం విద్యార్థులను చేర్పించే విధంగా తగు ముందస్తు చర్యలు చేపట్టాలని హాస్టల్ వార్డెన్లకు సూచించారు. పదవ తరగతిలో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విధంగా ఇప్పటినుంచే వారికి ప్రత్యేక ట్యూషన్లు ఏర్పాటు చేసి బాగా చదివించాలన్నారు. జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వారి సమస్యలపై పలు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సమావేశంలో మాట్లాడుతూ ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప

ఉన్నత స్థితికి తీసుకెళ్లేది గణితం : డిఇఒ

ప్రజాశక్తి - పాణ్యం

జీవితాన్ని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకుని వెళ్లే ఏకైక సాధనం గణితం అని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి పి. జనార్ధన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని విజయానికేతన్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. విజయానికేతన్ డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ నిజజీవితంలో అడుగడుగున గణితం ప్రాధాన్యత ఉంటుందని, అందుకే పెద్దలు లెక్కలు రానివాడు లెక్కలోకి రాడు అని అంటారని, గణితం తార్కికమైనదని ఆలోచన సామర్థ్యాన్ని పెంచి ఆనంద భావాలను కలిగిస్తుందన్నారు. చివరగా గణిత భాష ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన దాదాపు 100 రకాల గణిత నమూనాలు అందరిని ఆలోచింపజేశాయి. విజయానికేతన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళీధర చౌదరి మాట్లాడుతూ గణితాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకోవాలన్నారు. అకాడమిక్ ఇన్ఛార్జ్ మురారి, కోఆర్డినేటర్లు బ్రహ్మం, జహీర్, బాలకృష్ణ, గణిత ఉపాధ్యాయులు మునిరెడ్డి, సుబ్బయ్య, వెంకట్లు పాల్గొన్నారు.

వేడుకలను ప్రారంభిస్తున్న డిఇఒ జనార్ధన్రెడ్డి

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి బీసీకి సిఐటియు వినతి

ప్రజాశక్తి - బనగానపల్లె

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్లో సిఐటియు నాయకులు ఆర్అండ్బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. యేసురత్నం, ఎ నాగరాజులు మాట్లాడుతూ 108 ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, గతంలో ప్రభుత్వం చెప్పిన విధంగా రూ. 4వేల వేతనం పెంచాలని, ఇఎంటి ట్రైనింగ్ పేరుతో ఉద్యోగాలు తొలగించడం సమంజసం కాదన్నారు. భవ్య సంస్థ వారు వచ్చి నేటికి ఏడు నెలలకు వస్తున్నా ఏ ఉద్యోగికీ అపాయింట్మెంట్ లెటర్ ఇవ్వకపోవడం, వాహనం మరమ్మతులకు జిల్లాకు ఒక గ్యారేజ్ కాకుండా నియోజకవర్గానికి ఒక గ్యారేజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ వారు కీప్యాడ్ మొబైల్ మాత్రమే ఇవ్వడం మొబైల్ డేటా లేని కారణంగా కేసు తీసుకోవడం చాలా అవాంతరాలు ఏర్పడుతున్నాయన్నారు. 108 వాహనాలు ప్రదేశాల్లో షెల్టర్ లేకపోవడం వెహికల్ వాటర్ స్పెషలిటీ, ఉద్యోగులకు వసతులు లేకపోవడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనీస వసతులు కలిగిన షెల్టర్లు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లను మంత్రికి వివరించారు. సమస్యలన్నీ సంబంధిత శాఖ మంత్రికి, అధికారులకు దృష్టికి తీసుకెళ్తానని మంత్రి నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సుధాకర్, 108 యూనియన్ నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

సీఎం సహాయ నిధి పేదలకు వరం : మంత్రి బిసి

మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని రాష్ట్ర ఆర్అండ్బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి కింద 25 మంది లబ్ధిదారులకు మంజరైన రూ. 8.50లక్షల విలువైన చెక్కులను మంత్రి సోమవారం పంపిణీ చేశారు. కూటమిపాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై మంత్రి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ సిఎం సహాయ నిధిపేదల పాలిట కల్పతరువు అన్నారు. నిరుపేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వంలో కొండంత అండగా నిలుస్తుందన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్య సహాయం అందుతున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారించి ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్యంపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

వివిధ పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని గ్రామ పంచాయతీకి సంబంధించి రూ. 22 లక్షలతో నిర్మించిన నూతన భవనాలకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సోమవారం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అలాగే రోకియా బి దర్గా నుండి మదర్స వరకు రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. నియోజవర్గ సమస్యలపై నిరంతరం చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ గౌడ్, డిఇ అయ్యాజ్, పిఆర్ఎఇ ఎం శ్రీనివాసులు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ జయపాల్ రెడ్డి, పంచాయతీ ఇఒ నరేంద్ర, సర్పంచి జయపాల్, మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు, టిడిపి మండల అధ్యక్షుడు ఎంఎ కలాం, టిడిపి సీనియర్ నాయకులు జాకీర్ హుస్సేన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు రసూల్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బాల్య వివాహాలు సమాజానికి శాపమని, ఇవి పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హల్ కారిడార్లో ప్రజా వినతుల స్వీకరణకు ముందు జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనపై వంద రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ బాల్యవివాహాలతో బాలికల ఆరోగ్యం, విద్య, సామాజిక అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21ఏళ్లలోపు బాలురకు వివాహం చేయడం నేరమని స్పష్టం చేశారు. బాల్యవివాహాల నివారణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. ఎక్కడైనా బాల్యవివాహాల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్లైన్ 1098 లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కోరారు.

చట్ట పరిధిలోని వినతులను పరిష్కరిస్తాం

- గ్రీవెన్స్కు 94 ఫిర్యాదులు - జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీస్ స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పి కార్యాలయంలో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ 94 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆదేశించారు.

ఫిర్యాదుల్లో కొన్ని... రెండు సెంట్లు స్థలం రిజిస్ట్రేషన్ చేయిస్తామని వెంకటేశ్వర్లు, అశోక్, రమణయ్యలు రూ.3.50లక్షల నగదు తీసుకొని స్థలం రిజిస్ట్రేషన్ చేయకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని న్యాయం చేయండని నంద్యాల పట్టణం సాయిబాబా నగర్కు చెందిన లక్ష్మీదేవి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పొన్నాపురం గ్రామానికి చెందిన పసుపుల రూపేంద్ర, నీరజాక్షి నుండి 2024లో 3.952 స్థలం కొనుగోలు చేస్తే కొద్ది రోజుల కిందట శుభ్రం చేసుకునేందుకు వెళ్లగా రూపేంద్ర నీరజాక్షి మరికొందరు వచ్చి అదనంగా డబ్బులు చెల్లిస్తేనే స్థలం లోకి రాణిస్తాం అని ఆటంకం కలగజేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని న్యాయం చేయాలని బాధితురాలు సత్యవతి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 'జిల్లెల్ల గ్రామానికి చెందిన మద్దిలేటి అనే వ్యక్తి సుమారు 40 రోజుల కిందట పాలు ఇచ్చే ఒక బర్రెను కొనుగోలు చేసి తీసుకొని వెళ్లి ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదని, డబ్బులు ఇవ్వమని అడుగగా నాపై దౌర్జన్యం చేస్తున్నాడ'ని న్యాయం చేయాలని అయ్యలూరు గ్రామానికి చెందిన వెంకటరమణ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. 'బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో సర్వే నంబర్ 718/2లో మా పూర్వీకుల నుంచి సంక్రమించిన 1.09 సెంట్ల పొలం ఉందని, సదరు స్థలం మాది అని మహేష్ నాగిరెడ్డి అనువారు మాపై దౌర్జన్యం చేసి బెదిరిస్తున్నారని, మాకు న్యాయం చేయాల'ని బేతంచర్ల మండలం గోరుగట్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

ఆకట్టుకున్న శశిధర్ సైన్స్ ప్రాజెక్ట్

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రశంశలు

ప్రజాశక్తి - రుద్రవరం : మోడల్ విద్యార్థి శశిధర్ ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్ట్ ఆకట్టుకోవడంతో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ప్రశంసించారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్కు విద్యార్థి శశిధర్ ఎంపికయ్యారు. రుద్రవరం ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థి శశీధర్ జిల్లా సైన్స్ ఫెయిర్ ప్రాజెక్ట్లో అసాధారణ ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా సైన్స్ ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే విద్యార్థి శశీధర్ను ప్రత్యేకంగా పిలిచి 'శశీధర్ నీ సైన్స్ ప్రాజెక్ట్ రాష్ట్ర వ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంది. నీ శ్రమ, ఆలోచనా శక్తి ఆవిష్కరణా తపన అద్భుతమ'ని ఇలాంటి ప్రతిభలు మన దేశ భవిష్యత్తును మెరుగుపరుస్తాయన్నారు. మరిన్ని ఆవిష్కరణలు చేసి శాస్త్రవేత్తగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. నీ మీద పూర్తి విశ్వాసం ఉందంటూ ప్రోత్సహించారు. విద్యార్థికి చిరు సత్కారం చేశారు. ఆనందంతో విద్యార్థి శశీధర్ 'ధన్యవాదాలు మేడమ్ మీ ప్రోత్సాహం నాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుంద'ని కృతజ్ఞతలు తెలిపారు. సైన్స్ ఫ్యాకల్టీ లలిత శశీధర్ తండ్రి బాల నరసయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది, ఎస్ఎంసి సభ్యులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, విద్యార్థులు ఈ విజయాన్ని గర్వంగా భావిస్తూ శశీధర్ విద్యలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం లలిత, దివాకర్, తండ్రి బాల నరసయ్య ఉన్నారు. ఈ నెల 23న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

స్థానిక సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజు సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. హుస్సేన్ బాషా అధ్యక్షత వహించి శ్రీనివాస రామానుజన్ గొప్పతనాన్ని, గణిత శాస్త్రానికి ఆయన చేసిన సేవలను, నూతన ఆవిష్కరణల గురించి విద్యార్థులకు వివరించారు. గణిత శాస్త్ర అధ్యాపకురాలు బి. మీనాక్షి విద్యార్థినీ విద్యార్థులకు గణిత శాస్త్రంలో క్విజ్ పోటీని నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్. శివ నాగిరెడ్డి, ఎస్. పూర్ణేశ్వర్ రెడ్డి, ఎస్. మహేశ్వర్ రెడ్డి, టి. ఇందిరా ప్రియదర్శిని, ఎస్కే. షాహిదా బేగం, డాక్టర్ వై. కిరణ్ కుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న అధ్యాపకులు

మేదరి కులవృత్తి సమస్యలు పరిష్కరిస్తాం

- ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - మహానంది

మేదరి కులవృత్తి సమస్యలు పరిష్కారిస్తామని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నట్లు మహానంది మండల జనసేన నాయకులు నల్లబోతుల మల్లికార్జున, మారెడ్డి రామయ్యలు తెలిపారు. మహానంది మండలంలోని గాజులపల్లె, ఆర్ఎస్ గాజులపల్లె, తిమ్మాపురం, మహానంది పలు గ్రామాల్లో వెదురు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేదరి, ఎరుకల సమస్యలను మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సోమవారం వినతి పత్రం అందజేశారు. జనసేన నాయకులు మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందిస్తూ.. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వేగవంతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మేదర్ల జీవనోపాధికి సొసైటీ ద్వారా వెదుర్లు అందిస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. మూడు నెలల కిందట అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలను వెంటనే విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వెంటనే వెదరు కులవృత్తిపై జీవనం సాగిస్తున్న వారి సమస్యను సానుకూలంగా స్పందించినందుకు ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, మెదరి, ఏరుకల కులస్తులు పాల్గొన్నారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన మాండ్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను హైదరాబాదులోని నారా లోకేష్ స్వగృహంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జీ మాండ్ర శివానందరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలను మోడల్ స్కూల్ తరహాలో అభివృద్ధి పరచాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని, అలాగే జూపాడు బంగ్లా మండలంలోని తంగడంచ సీడ్ పార్కును అభివృద్ధి పరచాలని కోరినట్లు చెప్పారు. అలాగే మిడుతూరు ఎత్తిపోతల పథకం ఏర్పాటు గురించి మంత్రి నారా లోకేష్‌తో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాలపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

ఎన్‌జిఓస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా అంకి రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎపి ఇరిగేషన్ ఎన్‌జిఓస్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా పి. అంకి రెడ్డి ఎన్నికయ్యారు. ఈయన నంద్యాల తెలుగు గంగ సర్కిల్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. పి. అంకి రెడ్డి స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారని ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అసోసియేషన్ స్టేట్ మాజీ ఉపాధ్యక్షులు టి. మణిశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం, బట్టువారిపల్లిని.. ప్రత్యేక పంచాయతీలుగా చేయాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని గోకవరం, బట్టువారిపల్లి గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు మల్లయ్య, మునిరంగ, భాషపోగు సుంకన్న, పక్కీరయ్యలు ఎంపిడిఒ డి. మేరీ, డిప్యూటీ ఎంపిడిఒ సుబ్బారావులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గోకవరం గ్రామ పంచాయతీలో ఎం. లింగాపురం, గోకవరం, బట్టువారిపల్లి గ్రామాలు ఉన్నాయని తెలిపారు. అయితే ప్రత్యేక పంచాయతీగా బట్టువారిపల్లి, గోకవరమును చేయాలని కోరారు. ఈ విషయంపై ఎంపిడిఒ మేరీ మాట్లాడుతూ గ్రామస్తుల వినతి పత్రాన్ని జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు. వినతి పత్రమిచ్చిన వారిలో గ్రామస్తులు శంకర్, విజయుడు తదితరులు ఉన్నారు.

రబీ ఈ-పంట నమోదు చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు రబీ సీజన్లో వేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని ఎఒ అమీ రున్నీసా బేగం తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా సిబ్బందితో ఆమె సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న రైతులు రబీ సీజన్లో వేసిన పంటలకు ఈ-పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు వేసిన పంటకి ఈ -పంట కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్-ప్రతి రైతుకీ ఒక ఐడి తప్పనిసరి, వ్యవసాయంకు సంబందించిన పథకాలు ఫార్మర్ రిజిస్టర్‌తో ముడిపడి ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పొలం పిలుస్తుంది, పొలంబడి, వివిధ సర్వేల గురించి సలహాలు రైతు సేవా కేంద్రం సిబ్బందికి వివరించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ, అన్ని గ్రామాల రైతు సేవా సిబ్బంది, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

ఆధునిక యంత్రాలతో వరి సాగు లాభదాయకం : ఎఒ

ప్రజాశక్తి - రుద్రవరం

ఆధునిక యంత్రాలతో వరి సాగు చేయడంతో రైతులకు లాభదాయకమని ఎఒ సుమతి అన్నారు. మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో ఉప్పరి శివ రాముడు అనే రైతు పొలంలో ఆధుని యంత్రంతో వరి నాటును ఆమె సోమవారం పరిశీలించి మాట్లాడారు. రైతులు నూతన టెక్నాలజీతో వరి సాగు చేయడం వలన కూలీల ఖర్చు, సమయం ఆదా కావడంతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. మిషన్‌తో నాటించడం వలన వరిలో అధిక పిలకలు వచ్చి దిగుబడిలో పెరుగుదల ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు, ఫహీమా హబస్సుమ్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' చట్టం పేరు మార్చొద్దు

బనగానపల్లె : తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును మార్చొద్దని సిపిఐ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ నారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సిపిఐ మండల కార్యదర్శి ఎ శివయ్య మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అయిన తర్వాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తీవ్రమైన ఆటంకాలు కలిగిస్తూ వస్తుందని విమర్శించారు. పేదలకు పట్టెడు అన్నం పెట్టే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని రకరకాలుగా కుట్రలు పండుతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ విబిజిరాం అనే బిల్లును పార్లమెంట్లో ఆమోదించిందని, ఈ బిల్లు వల్ల ఉపాధి కూలీలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. వేతనాల పెంపు, పని దినాల పెంపు పెరగకపోగా రోజువారి కూలి రూ. 240 తగ్గించిందన్నారు. చట్టం తెచ్చేటప్పుడు అప్పటి యూపీఏ ప్రభుత్వం అందరి అభిప్రాయాలు తీసుకొని చట్టం తెచ్చిందని, కేంద్ర బిజెపి ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో బిల్లు ఆమోదం చేసి మహాత్మా గాంధీపై ఉన్న కోపాన్ని ఇలా తీర్చుకుంటుందని విమర్శించారు. పేదలకు నష్టం జరుగుతుందని కూటమి ప్రభుత్వానికి తెలుసని, కూటమిలో భాగస్వామి అయినా రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా అడగలేక పోతుందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, ఉపాధి హామీ కూలికి ప్రతిరోజు వారి కూలి రూ. 600 డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సభ్యులు జి. సంజీవులు, సిపిఐ మండల సమితి సభ్యులు ఖాదర్, సుబ్రహ్మణ్యం, మహిళా సమైక్య కార్యదర్శి స్వరూప, సుబ్బయ్య నాయక్, ప్రజలు పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్ : కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని క్రమబద్ధీకరణ చేస్తూ గ్రామీణ పేదల, కష్ట జీవుల ఉపాధిని దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రఘురామమూర్తులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఉపాధి కూలీలతో కలిసి సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచేందుకు, మహాత్మా గాంధీ పేరు తొలగింపు జాతిపితను అవమానించడమేనని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మహాత్మా గాంధీ పేరుని కొనసాగించాలని మోడీ ప్రభుత్వం చట్టాలు, పథకాల పేర్ల మార్పుపై పెట్టే శ్రద్ధ దేశ ప్రగతిపై పెట్టాలని ధ్వజమెత్తారు. పథకాల పేర్ల మార్పుతో అనవసర ఖర్చు తప్పా ప్రయోజనం లేదన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఏళ్ల తరబడి వ్యవసాయ కూలీలు, కష్ట జీవులు గ్రామీణ కార్మికులు చేతివృత్తిదారులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఇది చట్టబద్ధమైన హక్కుగా మారింది తెలిపారు. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దానికి వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (వి.బి-జి రామ్ జి) పథకాన్ని తీసుకొచ్చి గ్రామీణ పేదలను రోడ్డున పడేసిందని ఆరోపించారు. ఈ కొత్త పథకం గ్రామీణ పేదలు వ్యవసాయ కూలీల శ్రమను కార్పొరేట్లకు దోచుకునేందుకు ఉపయోగపడుతుందని ఆరోపించారు. తక్షణమే చట్టం పేరు మార్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు కలాం, మౌలాలి, రాముడు జగదీష్, జయమ్మ, రవి శ్రీలత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్తగా చేసిన ఉపాధి చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. పగిడ్యాల ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం 2వ మండల మహాసభలను జిల్లా నాయకురాలు ఈశ్వరమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పక్కీర్ సాహెబ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి విబి జిరామ్ జి అనే పేరు పెట్టడం సరైందికాదని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తొలగించేందుకే 60 శాతం నిధులు మంజూరు చేసి మిగతావి రాష్ట్రాలపై భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో 90 శాతం నిధులు మంజూరు చేసేవారని, బిజెపి అధికారం చేపట్టినప్పటి నుంచి అరకొరగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. దేశమంతా గాంధీని గౌరవిస్తుంటే ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పాలన కొనసాగిస్తున్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీపై అక్కసు వెళ్ల కక్కి గాడ్సే వారసులమని నిరూపించుకుందని మండిపడ్డారు. పార్లమెంటులో లౌకిక పార్టీలన్నీ వ్యతిరేకించినా పూర్తి మెజార్టీ ఉందని బిల్లుని ఆమోదించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఈశ్వరమ్మ, కార్యదర్శిగా మధులత, సహాయ కార్యదర్శిగా విజయుడు, ఉపాధ్యక్షులుగా స్వాములు, సహకార దర్శి జయకృష్ణ, ట్రెజరీ సూరి వీరితోపాటు నలుగురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, నరసింహులు, మహేహార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : విబి జి రామ్ జి తొలగించేందుకు వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ప్రజా సంఘాలతో కలుపుకొని పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఎం మండల కార్యదర్శి ఎం మధు శేఖర్, సిపిఐ మండల కార్యదర్శి వై భార్గవ్ సీనియర్ నాయకులు వై ఎల్లయ్య అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్లో సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్, సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి మధుశేఖర్ల ఆధ్వర్యంలో పట్టణ నాయకులు రామాంజనేయులు అధ్యక్షతన నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ చట్టబద్ధ హక్కుగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తీవ్రంగా వ్యతిరేకించాలని. యుపిఏ ప్రభుత్వంపై ఆనాడు వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మౌలిక స్వభావాన్ని నేడు కేంద్ర ప్రభుత్వం మారుస్తుందన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రామ జి) పేరుతో ఉపాధిహామీ పథకానికి "రాంరాం" పలకనున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, డి.దస్తగిరి, పట్టణ కార్యదర్శి పి.నాగరాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఏఐవైఎఫ్ నాయకులు భాస్కర్, ఖదీర్, బాలు, గోపి, టైలర్ బాలు, తిరుపాలు, సుబ్బరాయుడు, శ్రీను, రవి, శివ, సీపీఎం మండల, పట్టణ నాయకులు రామకృష్ణ, వెంకటేష్ నాయక్, గోరంట్ల, ఖాజా, విష్ణు, హరిక్రిష్ణ, హిమామ్, శ్రీనివాసులు, రామచంద్రుడు, రాజబాబు, ఎస్.కె.భాష, టింగు, నారాయణ, రామశేఖర్, ఖాజా బాషా ,నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్ : ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు

పగిడ్యాల : వ్యకాస రెండవ మాసభలో మాట్లాడుతున్న పక్కీర్ సాహెబ్

బేతంచెర్ల : రాస్తారోకో నిర్వహిస్తున్న వామపక్షాలు

అంగన్వాడీలకు 5జీ ఫోన్లు పంపిణీ

ఆత్మకూరు

ఆళ్లగడ్డ

నందికొట్కూరు టౌన్

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 250 మంది అంగన్వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తన స్వగృహం వద్ద, ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం 5జీ ఫోన్లు పంపిణీ చేశారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఫోన్లు సరిగ్గా పని చేయడం లేదని, అన్నీ యాప్‌లు పని చేయడం లేదని సెల్ ఫోన్లను ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులకు అప్పగించి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 5జీ సెల్ ఫోన్లను మంజూరు చేసింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ కోటేశ్వరమ్మ, సూపర్ వైజర్లు కోమలి, రమాదేవి, జయలక్ష్మీ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆళ్లగడ్డ తాలూకాలోని అంగన్వాడీ టీచర్స్, సూపర్వైజర్స్‌కి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ 5జి మొబైల్స్‌ను అందించారు. సోమవారం సిడిపిఒ తేజేశ్వరి, సూపర్వైజర్స్ దస్తగిరమ్మ, పార్వతి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు 5జి మొబైల్స్ అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత ఫోన్లో నెట్వర్క్ సమస్యల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం 5జి స్మార్ట్ ఫోన్లు అందిస్తున్నదని తెలిపారు. సాంకేతిక ఇబ్బందుల్లేకుండా ఆధునిక ఫోన్లు అందజేశామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో ఉపయోగపడతాయన్నారు. కొన్నేళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో అంగన్వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ సూపర్ వైజర్లకు, టీచర్లకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సోమవారం 5జి స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాత ఫోన్లలో నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడానికి, ఆన్‌లైన్ రిపోర్టింగ్ వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 5జి స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం శర్మ, ఐసిడిఎస్ సిడిపిఒ మంగవల్లి, మండల కన్వీనర్, సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, షకీల్ అహ్మద్, ముర్తుజావలి, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో సంత.. ఇబ్బందుల్లో వ్యాపారులు

ప్రజాశక్తి - సంజామల

గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వారాంతపు సంత మార్కెట్ సమస్యలకు నిలయంగా మారుతుంది. సౌకర్యం లేని సంతల్లో రానురాను వ్యాపారాలు జరగడమే గగనమైపోతుంది. వ్యాపారులకు, రైతులకు అధికారులు ఎలాంటి వసతి సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. సంజామల మండలం సంజామల, సోమల నొస్సం గ్రామాల్లో ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తారు. సంజాములలో జరిగే సంతలో చిన్న చిన్న వ్యాపారులే తప్పా పెద్ద వ్యాపారాలు మచ్చుకైనా కానరావు. వారంవారం జరిగే ఈ సంతకు గిద్దలూరు, మంగ పల్లె, కానాల, యగ్గోని, ముచ్చలపురి, కొత్తపేట, గుల్లదుర్తి, కోటపాడు ఆయా గ్రామాల నుంచి ప్రజలు వ్యాపారం నిమిత్తం వస్తుంటారు. సంతలో ఎక్కువగా కూరగాయలు నిత్యావసర వస్తువులు పండ్లు చిన్న చిన్న వ్యాపారాలు కొనసాగుతుంటాయి. పేరుకు మాత్రం పెద్ద సంత. సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు తక్కువగా ఈ సంతకు వస్తారు. సంత మార్కెట్‌ను బస్సులు వెళ్లే రోడ్డుపైనే నిర్వహించడంతో వ్యాపారులకు అడుగడుగునా సమస్యలే ఎదురవుతున్నాయి. వేసవి మండుటెండల్లో, వర్షాకాలంలో సంతను ఆరుబయట రోడ్డుపై నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండకు ఎండి వానకు తడిసి కూరగాయలు వస్తువులు పాడైపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని వ్యాపారులు వాపోతున్నారు. ఒక్కోసారి సంత పరిస్థితి చూసి వ్యాపారులు వెనుదిరిగి వెళ్తుంటారు. సంతలో సౌకర్యాలు కల్పిస్తే వ్యాపారం పెరిగి పంచాయతీకి మరింత ఆదాయం వస్తుందని గ్రామస్తులు, వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు గేటు మాత్రం కచ్చితంగా వసూలు చేస్తారు. సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుందని వ్యాపారులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతలో సౌకర్యాలు కల్పించి పంచాయతీ ఆదాయం పెరిగేటట్లు చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి

సంజామలలో ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తారు. సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు తక్కువగా వస్తున్నారు. సౌకర్యాలు కల్పిస్తే కూరగాయలు, జిలకర వస్తువులతోపాటు బట్టల వ్యాపారస్తులు వస్తారు. అలాగే బెల్లం చెరుకు వ్యాపారస్తులు ఎక్కువగా వస్తారు. పంచాయతీ ఆదాయం పెరుగుతుంది. గతంలో అధికారులకు తెలిపిన ఇంతవరకు సౌకర్యాలు కల్పించలేదు. ముఖ్యంగా ఎదురెదురుగా బస్సులు వస్తే వ్యాపారులు లేవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పాలకులు అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

- ఈశ్వర చారి, సంజామల

సిఎం వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మహిళా వైద్యురాలిని అగౌరవపరిచిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో పలు ప్రజాసంఘాల నాయకులు, మహిళలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ కన్వీనర్ బీరువాల బాష, ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ బరగొడ్ల హుస్సేన్ బాష, ఎస్‌డిపిఐ నాయకులు ముక్తార్, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ కలాం తదితరులు మాట్లాడారు. బీహార్ ముఖ్యమంత్రి హిజాబ్‌కు సంబంధించిన వ్యాఖ్యలు ముస్లిం సమాజ భావోద్వేగాలను దెబ్బతీయటమే కాకుండా భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కులపై ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ వెస్లీ, మాల మహానాడు బక్కవాళ్ళ చంద్రశేఖర్, సెక్రటరీ చక్రవర్తి, రజకుల సంఘం నాయకులు ఆమడాల రమణ తదితరులు మాట్లాడుతూ హిజబ్ అనేది ఒక మతాచారం మాత్రమే కాకుండా మహిళా గౌరవం వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రతీక అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్‌డిపిఐ జిల్లా కార్యదర్శి కరిముల్లా, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ఫక్రుద్దీన్, నూర్ బాషా సంఘం నాయకులు మస్తాన్, జేఏసీ కమిటీ సభ్యులు బైక్ మెకానిక్ నూర్ బాషా, హుస్సేన్ మజీద్ మౌజన్వా హుస్సేన్ బాష పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

క్రిస్మస్ వేడుకలకు బిసి రాజారెడ్డికి ఆహ్వానం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న మదర్ థెరిస్సా చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకలకు పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డిని ఆహ్వానించారు. సోమవారం రాత్రి పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో క్రిస్మస్ పండగకు రావాలని బిసి రాజారెడ్డిని కలిసి చర్చి ఫాదర్ సూరి పోగుల ప్రకాష్ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈ నెల 24 రాత్రి మదర్ థెరిస్సా చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చర్చి ఫాదర్ సూరి పోగుల ప్రకాష్ తెలిపారు. వేడుకల్లో పాల్గొనాలని బీసీ రాజారెడ్డిని ఆహ్వానించారు. ముందస్తుగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని బిసి రాజారెడ్డి వారికి సూచించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ సూరి పోగుల ప్రకాశ్, సిస్టర్స్, సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి - రుద్రవరం

మండల కేంద్రంలోని దళిత కాలనీకి చెందిన వైఎస్ఆర్‌పి కార్యకర్త గంగుల కుటుంబ వీరాభిమాని నందవరం రాముడు(టైలర్) (63) ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి సీనియర్ నాయకులు ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ గంధం వీర రాఘవరెడ్డి మృతుని ఇంటి దగ్గరకు వెళ్లి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాముడు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు కొల్లం పుల్లయ్య, ఎంపిపి మబ్బు బాలస్వామి, నాయకులు కొల్లం కేసి నరసింహులు, తెలుగు చిన్న నాగన్న, నల్లవాగుపల్లి ఖాదర్, బాచుపల్లి పాములేటిలు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పల్స్ పోలీయో విజయవంతం

ప్రజాశక్తి - పాములపాడు

మండల కేంద్రం సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ 24ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలతో పాటు, ప్రత్యేకంగా జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని విజయవంతం చేయడానికి కృషి చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఎస్. షర్ఫుద్దీన్ అలీ తెలిపారపు. ఆయన మాట్లాడుతూ 2002 నుండి నేటి వరకు జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాల అవగాహన ర్యాలీలలో, ఏపీఎస్ఆర్టిసి బస్టాండ్‌లో మా స్వచ్ఛంద సంస్థ కోసం కేటాయించిన బూత్ నెంబర్-27లో ప్రయాణంలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించినట్లు తెలిపారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాశక్తి - ప్యాపిలి

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి ఎస్.ఏ.చిన్న రెహమాన్, అధ్యక్షులు రామాంజనేయులు పేర్కొన్నారు. మూడేళ్ల కాలంలో పోరాటాలను సమీక్షించుకొని రాబోవు కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక కర్షక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సమాయత్తం అయ్యేందుకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణంలో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం గోడపత్రికలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రకటించిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను కేరళ రాష్ట్రంలో అమలు చేయబోమని కార్మిక మంత్రి, కేరళ సిఎం బహిరంగంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. సిపిఎం నాయకత్వంలోని కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి కార్మిక వర్గం తరపున ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులను నయాబానిసలుగా చేసే విధానాలను అమలు చేస్తుందని, మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వంత పాడడం తప్పా కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్రిటిష్ కాలం నాటి నుండి కార్మికులు పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కాలరాశి పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు ప్రయోజనాలు కలిగేలా చట్టాలలో మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ అమలు చేస్తున్న ఎనిమిది గంటల పని విధానాన్ని తుంగలో తొక్కి మనదేశంలో మాత్రం 13 గంటల పని విధానాన్ని అమలు చేయడానికి సిద్ధపడటం చూస్తుంటే మోడీ కార్మిక వర్గ ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. బిఎస్ఎన్ఎల్, రైల్వే, రక్షణ, ఎల్ఐసి, పోస్టల్, బ్యాంకులు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కారు చౌకగా అప్పజెప్పి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడం దుర్మార్గం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నెట్టుకల్లు, ఇలియాజ్, నాగేంద్ర, రవి ఖాదర్, హనుమంతు, రాఘవేంద్ర, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఖజానా కార్యాలయంలో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి - ప్యాపిలి

డోన్ పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయంలో ఎసిబి అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. డోన్ మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా శ్యామ్ రాజు పని చేస్తూ జూన్ 30న రిటైర్డ్ అయ్యారు. పెన్షన్ మంజూరు అయ్యింది కానీ పెన్షన్ బెనిఫిట్స్ కోసం ఐదు నెలల నుండి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని, సీనియర్ అసిస్టెంట్ ఆర్.లక్ష్మణ్ నాయక్ రూ.45000 డిమాండ్ చేయగా రూ.30వేలు ఇస్తానని ఒప్పుకున్నట్లు శ్యామ్ రాజు ఫిర్యాది మేరకు ఎసిబి డిఎస్పి సోమన్న దాడులు చేపట్టారు. డోన్ ఉప ఖజానా కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఆర్.లక్ష్మణ్ నాయక్ రూ.30వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడని తెలిపారు. సోదాల్లో సిఐలు కృష్ణయ్య, రాజ ప్రభాకర్, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కోట్ల

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్రజల ఉపాధి ఆర్థిక స్థిరత్వం ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎంఎల్ఏ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు.డోన్ పట్టణం లోని 2 వ వార్డ్ లో పి జి ఆర్ ఎస్, రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు.స్థానిక ప్రజలతో ముఖాముకి సమావేశం నిర్వహించి త్రాగునీరు, రోడ్లు పారిశుధ్యం, విద్యుత్ సంక్షేమ పథకాలు అంశాలపై ప్రజల వ్యక్తం చేసిన సమస్యలు విని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అంగన్వాడి టీచర్లకు విద్యార్థుల డేటా నమోదు చేయడానికి కూటమి ప్రభుత్వం అందించిన 5జి మొబైల్ ఫోన్లను అందించారు. ఎంఎల్ ఏ మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లు చిన్నారుల సంక్షేమ విషయంలో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అంగన్వాడి భవనాల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వంలో వ్యవస్థలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు.ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో అనుభవజ్ఞులైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండబట్టే రాష్ట్రం అభివృద్ధి పదంలో నడుస్తుందన్నారు. అన్నదాతల జీవితాల్లో కొత్త వెలుగులు రావాలి. అదే కూటమి ప్రభుత్వ ఆశయం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రసాద్ గౌడ్,పణిరాజ్, రాజేంద్ర గౌడ్ లక్కసాగరం లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తున్నామని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఎఓ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో అధికారులు పాల్గొని వినతులను స్వీకరించారు. ఎంఇఓ సావిత్రమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఈరమ్మ, హౌసింగ్ అధికారి కృష్ణ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, రెవెన్యూ కార్యదర్శి గోవిందప్ప పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్త అవసరం

- విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ సఫీవుల్లా ఖాన్, చాంద్ బాష

ప్రజాశక్తి - నందవరం

విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలని విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ సఫీవుల్లా ఖాన్, పిసి చాంద్ బాష తెలిపారు. విద్యుత్‌ను ఆదా చేస్తూ సక్రమంగా వాడుకోవాలని, విద్యుత్ చౌర్యానికి పాల్పలకూడదని చెప్పారు. సోమవారం మండలంలోని టి.సోమాల గూడూరులో గ్రామస్తులకు విద్యుత్ ప్రమాదాలు, చౌర్యం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ... వినియోగదారులు కచ్చితంగా మీటర్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను వాడుకోవాలని, అక్రమంగా వాడితే భారీగా అపరాద రుసుం వేస్తామని హెచ్చరించారు. జంతువుల వేటకు వాడే ఉచ్చులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదని, రైతులు పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌ను సొంతంగా వేసుకోరాదని తెలిపారు. ఇళ్లపై ఆడుకునే పిల్లలు విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలని, హీటర్ వాడేటప్పుడు స్విచ్ఛాఫ్ చేయకుండా నీటిని తాకరాదని చెప్పారు. లైన్‌మేన్ రాము యాదవ్ పాల్గొన్నారు.

గుడిసె కృష్ణమ్మ ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి- దేవనకొండ

టిడిపి జిల్లా అధ్యక్షులుగా గుడిసె కృష్ణమ్మకు ఎంపిక పట్ల టిడిపి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి, బాణసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఆలూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మల్లెపల్లి రంగడు, టిడిపి నాయకులు మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, శాంతి కుమార్, గిడ్డయ్య గౌడ్, చిన్న వెంకప్ప, రాజగోపాల్ గౌడ్, దస్తగిరి, తిమ్మప్ప, శ్రీనివాసులు, రాజు, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సోమవారం వేతనాలు పంపిణీ చేసినట్లు సర్పంచి హైమావతి, ఇన్‌ఛార్జీ పంచాయతీ కార్యదర్శి సతీష్ తెలిపారు. వారు మాట్లాడుతూ... ఎంపిడిఓ మణిమంజరి, డిప్యూటీ ఎంపిడిఓ అనంతశయన ఆదేశాల మేరకు పారిశుధ్య కార్మికులకు సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు అందజేశామని అన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు

బనగానపల్లె

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని వివిధ పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ రాజిక సత్య ప్రపూర్ణ, అధ్యాపకులు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రతోపాటు ఆయన గణిత రంగానికి చేసిన అమూల్యమైన సేవలపై వివరించారు. పరిమిత వనరులతో స్వయంకృషితో ప్రపంచ ఖ్యాతిని పొందిన ఆయన జీవితం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. గణితం కేవలం ఒక విషయంగా కాకుండా జీవన విధానంగా భావించాలని విద్యార్థులకు సూచించారు. గణిత శాస్త్ర అధ్యాపకులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గణిత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాసరామానుజన్ జయంతిని, గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 100 గణిత మోడల్స్‌ను విద్యార్థినిలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, ఉపాధ్యాయులు, శ్రీనివాసరెడ్డి, వరలక్ష్మి, నాగసురేఖ, జయసుధ, సుబ్బమ్మ, విజయలక్ష్మి, రేణుక, శివనాగేశ్వర రావు, రామ్మోహనరెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణమూర్తి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల : నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీలోని శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో దేశం గర్వించదగ్గ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పి. దస్తగిరి రెడ్డి, డైరెక్టర్ పి. మౌలాలి రెడ్డి హాజరై శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి వందన సమర్పణ గావించారు. విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత శాస్త్ర నమూనాలు, మ్యాథమెటిక్స్ ఫార్ములాస్‌తో కూడిన ఆక్టివిటీస్, ఆకట్టుకున్నాయి. చైర్మన్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గురురాజా ఓపెన్ ఆడిటోరియంలో విద్యార్థుల ఆవిష్కరణలు, నమూనాలు, ప్రాజెక్టులు, ఆలోచనత్మక రీతిలో, ప్రస్తుత పోటీ ప్రపంచంలో గణితం గొప్పతనాన్ని చాటేలా విద్యార్థులు బాల మేధావులుగా విజ్ఞానాన్ని సాధించే దిశలో దాదాపు 100 ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం గణిత శాస్త్రం పట్ల మేము తీసుకుంటున్న విధి విధానాలే నిదర్శనమన్నారు. ముఖ్యంగా ఒలంపియాడ్ ఐఐటి విద్యార్థుల ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్స్ అద్భుతంగా ప్రదర్శించారు. విద్యార్థుల ఉపన్యాసాలు చక్కగా ఆలోచింపచేసాయి. గణిత శాస్త్ర దినోత్సవం పురస్కరించుకొని స్కూల్ అంతర్భాగంలో భాగంగా మ్యాథ్స్‌బి, క్విజ్ పోటీలు విజేతలకు మెడల్స్ అందజేసి వారి విజయాలను ప్రశంసించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయ బృందం గౌరవ చైర్మన్, డైరెక్టర్‌ను పూలమాలలతో సత్కరించారు.

నంద్యాల బాల అకాడమీలో

ఆత్మకూరు : పట్టణంలోని పుల్లారెడ్డి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శ్రీనివాస రామాజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి సిబ్బంది నివాళులర్పించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాంద్‌బాషా, గణిత ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రఫియా, రాఘవేంద్రమ్మ, ఉమాదేవి, ఆయూషా, లక్ష్మీదేవి, మల్లీశ్వరి, హేమలత, చంద్రకళ, మల్లికార్జున్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

నంద్యాల : నంద్యాల జిల్లాలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమి పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల పౌండర్ ఎంజివి కొండయ్య, డైరెక్టర్ ఎంజివి రవీంద్రనాథ్ కరస్పాండెంట్ మాధవిలత, పాఠశాల గణిత ఉపాధ్యాయులు లక్ష్మి నారాయణ, శాంతి శేఖర్, శ్రీను, అంజన పాల్గొని మాట్లాడారు. ప్రముఖ భారత గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబర్ 22న ఎరోడ్‌లో జన్మించారని తెలిపారు. ఆయన పుట్టిన రోజునే జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. నిత్య జీవితంలో గణిత ప్రయోజనాలు, ప్రాముఖ్యత గురించి పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు. పాఠశాల చిన్నారులు గణిత పరమైన ప్రాజెక్టులను చక్కగా చేసి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నంద్యాల గురు రాజాలో

ఉత్సాహంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

- 33 మందికి ఉద్యోగావకాశాలు
- రూ.22వేల వేతనంతోపాటు బోనస్‌లు
- కళాశాలల చైర్మన్ రామకృష్ణా రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (అటానమస్)లో వెర్టెస్ గ్రూప్, మీడేంలాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఘనంగా జరిగిందని కళాశాల చైర్మన్ జి రామకృష్ణా రెడ్డి తెలిపారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు మొత్తం 98 మంది అభ్యర్థులు హాజరుకాగా, పలు దశల ఎంపిక అనంతరం 48 మందిని రెండో రౌండ్‌కు ఎంపిక చేయగా, చివరగా 33 మంది అభ్యర్థులు తుది ఎంపిక సాధించారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.22వేల వేతనంతోపాటు బోనస్‌లు, అలాగే మొదటి ప్రయాణ భత్యం (ట్రావెలింగ్ అలవెన్సు)ను కంపెనీ వారు అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు కళాశాల యాజమాన్యం తరపున వెర్టెస్ గ్రూప్, మీడేంలాబ్స్ సంస్థల ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించడమే మా కళాశాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలతో అనుసంధానం ద్వారా విద్యార్థులను పరిశ్రమలకు సిద్ధం చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలను తీసుకొచ్చి అర్హులైన ప్రతి విద్యార్థికీ ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వెర్టెస్ గ్రూప్ తరపున ఎస్. అనూష్ (చీఫ్ స్టాఫ్), మీడేంలాబ్స్ తరపున సుభాష్ (జనరల్ మేనేజర్), వాసు (అసిస్టెంట్ మేనేజర్) పాల్గొని సంస్థల అవసరాలు, ఉద్యోగ అవకాశాలపై వివరించారు. కార్యక్రమాన్ని కళాశాల ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ యువిఎస్. కుమార్, సంపత్ కుమార్ సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగిస్తామని కళాశాల యాజమాన్యం వెల్లడించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెబివి సుబ్బయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కళాశాలల చైర్మన్ రామకృష్ణా రెడ్డి

పివి రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - బనగానపల్లె

మాలల ఆశాజ్యోతి పివి రావు అని మాల సంఘాల జేఏసి రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి అన్నారు. పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో కీర్తిశేషులు పి.వి. రావు 20వ వర్ధంతి సందర్భంగా పివి రావు, ఆంధ్రప్రదేశ్ దళిత మొట్టమొదటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దస్తగిరి మాట్లాడుతూ 80 లక్షల మాలలకు పివి రావు ఆశాజ్యోతి అని, మాలలు అభ్యున్నతి కోసం పివి రావు ఎంతో కృషి చేశారని తెలిపారు. వర్గీకరణ ఉద్యమంలో తన ఉద్యోగం సైతం లెక్కచేయకుండా చివరికి తన ప్రాణాలర్పించారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మారం నాగరాజు, రాయలసీమ అధ్యక్షులు బి మద్దిలేటి, మాల మహానాడు మండల అధ్యక్షుడు కొత్తపేట నరసింహుడు, అంబాపురం పోలె కంటి వెంకటేష్, పోలేకంటి మధుశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్ : పివి రావు వర్ధంతిని మలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మహానాడు సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు పివి రావు చిత్ర పటానికి జెఎసి రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి పూలమాల వేసి నివాళులర్పించారు. మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైసీ పుల్లయ్య, దస్తగిరి మాట్లాడుతూ పివి రావు వర్గీకరణ ఉద్యమంలో తన ఉద్యోగాన్ని సైతం లెక్కచేయకుండా ప్రాణాలను అర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షుడు బి మద్దిలేటి, మాల మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు రాజేంద్ర, మద్దూరు మాజీ సర్పంచి మద్దిలేటి, నంద్యాల జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇల్లూరి భూపాల్ పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్ : దళితుల ఐక్య పోరులో అసువులు బాసిన మహనీయులు పీవీ రావు అని నందికొట్కూరు పివి రావు మాల మహానాడు నాయకులన్నారు. ముందుగా ఆయన చిత్ర పటానికి మాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్ డి. వెంకటేష్ మాట్లాడుతూ దళితుల ఐక్యత కోసం, దళిత హక్కుల పరిరక్షణ కోసం ఉద్యోగంతోపాటుగా జీవితాన్నే త్యాగం చేసిన కీర్తిశేషులు పీవీ రావు చిరస్మరణీయుడన్నారు. అంబేద్కర్, పూలే, పీవీ రావ్ ఆశయ సాధనకు దళితులందరూ పునరంకితం కావాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. అనంతరం పీవీ రావ్ అమర్ రహే, కొనసాగిస్తాం పీవీ రావ్ ఆశయాలను అంటూ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో బండారు శ్రీనివాసులు, పెరుమాళ్ళ మధు, చెరుకు నడిపెన్న, మల్ రెడ్డి రవికుమార్, కోర్ కమిటీ సభ్యులు సతీష్, పుల్లయ్య, ప్రసాద్, సుందర్ రావు పాల్గొన్నారు.



IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE:: NANDYAL (JUNIOR DIVISION)

O.S. No.995 /2019

Shaik Nabi Rasool ... Plaintiff

-V/s-

Shaik Shajahan Bee ... Defendant

SUMMONS TO DEFENDANT

Shaik Shajahan Bee, S/o Shaik Pakkir Saheb, aged about 55 years, Muslim, R/o H.No.26-607-Z-38-5, Priyanka nagar, Nandyal town and District.

పై నెంబర్ దావాను వాది, ప్రతివాది పై specific performance of agreement of sale దావాను పై కోర్టు యందు దాఖలు చేసినాడు. ప్రతివాది అయిన మీకు పై దావా యందు సమ్మన్లకు గాను 19-01-2026న వాయిదా ఉన్నది. కావున ప్రతివాది అయిన మీరు పై దావా యందు 19-01-2026వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట కుద్దుగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి పై దావా యందు మీ యొక్క ఆక్షేపణలు తెలుపవలెను. లేని యెడల పై ఘనమైన కోర్టు వారు మీ పరోక్షంగా పై దావాను తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియచేయదమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా: 19-01-2026

S.M.SUBHANI,
K.VENKOBA RAO
Advocate for plaintiff,
Nandyal.

IN THE COURT OF THE SPECIAL MAGISTRATE: NANDYAL

C.C.No. 679 /2019

Jarapati Srinivasulu ... Complainant

-V/s-

D.Bala Narasimha Reddy ... Accused

NOTICE TO ACCUSED

D.Bala Narasimha Reddy, S/o Pedda Narasimha Reddy, aged about 50 years, Hindu, Proprietor of Sri Lakshmi Narasimha Drilling and Blasting Service, R/o H.No.3-64, Khadarpalli Village, Chapadu Mandal, YSR Kadapa District.

పై అర్జి నందు ఫిర్యాదుదారుడు, ముద్దాయిపై చెక్కు బౌన్సు కేసును దాఖలు చేసినాడు. సదరు పై కంప్లైంట్ యందు ముద్దాయి అయిన మీకు నోటీసులకు గాను 19-01-2026 తేదీన పై C.C.No.679/2018 యందు వాయిదా ఉన్నది. కావున ముద్దాయి అయిన మీరు 19-01-2026 వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట కుద్దుగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి పై C.C.No.679/2018 యందు మీ యొక్క ఆక్షేపణలు తెలుపవలెను. లేని యెడల పై కోర్టు వారు మీ పరోక్షంగా పై కంప్లైంటును తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియ చేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా: 19-01-2026

S.M.SUBHANI, B.A.L.L.B.,
K.VENKOBA RAO, B.A.B.L.,
Advocates for complainan
Nandyal Town. Cell:9963920866

IN THE COURT OF THE SPECIAL MAGISTRATE: NANDYAL

C.C.No. 2363 /2019

Marella Srinivasulu ... Complainant

-V/s-

Chilakala Venkta Ramprasad ... Accused

NOTICE TO ACCUSED

Chilakala Venkata Ramprasad, S/o C.Thimmaiah, aged about 55 years, Hindu, Prop. M/s Maheswari Fancy and Ladies Corner, R/oH.No.28-1056-2, Saibaba nagar, Railway Station Road, Nandyal town and District.

పై అర్జి నందు ఫిర్యాదుదారుడు, ముద్దాయిపై చెక్కు బౌన్సు కేసును దాఖలు చేసినాడు. సదరు పై కంప్లైంట్ యందు ముద్దాయి అయిన మీకు నోటీసులకు గాను 12-01-2026 తేదీన పై C.C.No.2363/2019 యందు వాయిదా ఉన్నది. కావున ముద్దాయి అయిన మీరు 12-01-2026 వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట కుద్దుగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి పై C.C.No.2363/2019 యందు మీ యొక్క ఆక్షేపణలు తెలుపవలెను. లేని యెడల పై కోర్టు వారు మీ పరోక్షంగా పై కంప్లైంటును తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియ చేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా: 12-01-2026

S.M.SUBHANI, B.A.L.L.B.,
K.VENKOBA RAO, B.A.B.L.,
Advocates for complainan
Nandyal Town. Cell:9963920866